# తీన్మార్

teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి: 04 | సంచిక: 275 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | శనివారం 11 ఏప్రిల్ 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad


## మహిళా ఉద్యోగుల రక్షణకు సర్కార్ అడుగు

సచివాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ 2






## తప్పుడు ప్రచారం చేస్తే ఖబడ్దార్

- అంగన్‌వాడీ ఫోన్ల కొనుగోలుపై మంత్రి సీతక్క ఫైర్
- సమస్యలు ఉంటే నేరుగా నా దగ్గరకే రండి
- మాలాంటి వాళ్ళను అంటే నాశనం అవుతారు
- త్వరలో మొబైల్ అంగన్‌వాడీలు
- అంగన్‌వాడీల సమస్యలు తీరుస్తాం:మంత్రి సీతక్క

హైదరాబాద్, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్ల పంపిణీ విషయంలో కావాలనే కొందరు తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పిచ్చి పిచ్చిగా వాగుతున్నారని మండిపడ్డారు. మాలాంటి వాళ్లను అంటే - మిగతా2లో

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వాహనాలు సీజ్ చేయొద్దు






- పోలీసులకు అధికారం లేదని స్పష్టీకరణ
- హక్కుల రక్షణే ముఖ్యం
- పోలీసులకు హైకోర్టు చురకలు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్): డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులపై తెలంగాణ హైకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పరీక్షల సందర్భంగా పట్టుబడిన వాహనాలను సీజ్ చేసే అధికారం పోలీసులకు లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. గతంలోనే ఈ విషయాన్ని తేల్చి చెప్పిన హైకోర్టు, పౌరుల హక్కులను పరిరక్షించేందుకు మరోసారి దీనిని నొక్కి చెప్పింది. మద్యం సేవించిన డ్రైవర్ పట్టుబడిన సందర్భంలో, అతని వాహనంలో మద్యం సేవించని వారుంటే వారికే వాహనాన్ని అప్పగించాలని తెలంగాణ పోలీస్ శాఖకు హైకోర్టు సూచించింది.

## కుల గణన నిలిపివేతకు సుప్రీంకోర్టు నో



- జనగణనలో కులాల గుట్టు తేలాల్సిందే 2
- పిటిషన్ కొట్టివేసిన ధర్మాసనం

## తెలంగాణ కొత్త డీజీపీగా సి.వి. ఆనంద్?



- రాష్ట్ర తదుపరి పోలీస్ బాస్ రేసులో ముగ్గురు 2
- తుది దశకు నియామక ప్రక్రియ

## ఇంటర్ ఫలితాలకు ముహూర్తం ఖరారు



- ఏప్రిల్ 12న రిజల్ట్స్ విడుదల
- రికార్డు స్థాయిలో వేగంగా ఫలితాలు 2
- ఏప్రిల్ 12న మార్కుల సందడి

## గులాబీ గూటికి సీనియర్ నేత జీవన్ రెడ్డి



- అన్నా.. మీతో కలిసి పనిచేయాలనే వచ్చా..
- కేసీఆర్‌ను చూసి భావోద్వేగంతో కన్నీటి పర్యంతం
- ఎర్రవెల్లిలో అపూర్వ కలయిక

హైదరాబాద్, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాజకీయాల్లో దశాబ్దాల అనుభవం ఉన్న ఇద్దరు దిగ్గజ నేతలు ఒకరు ఉద్యమ నాయకుడు కేసీఆర్, మరొకరు రైతు పక్షపాతి జీవన్ రెడ్డి. సుదీర్ఘ విరామం తర్వాత ఈ ఇద్దరు నేతలు ఒక్కటవ్వడం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. శుక్రవారం నాడు ఎర్రవెల్లి - మిగతా2లో

## నల్గొండ, ఖమ్మం అభివృద్ధికి కేంద్రం మద్దతు

- సేతు బంధన్ పథకం కింద రూ.103 కోట్లు
- హర్షం వ్యక్తం చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 2
- అభివృద్ధి పథంలో తెలంగాణ: కిషన్ రెడ్డి హర్షం



## ఢిల్లీలో సీడబ్ల్యూసీ భేటీ

- నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లపై చర్చ
- ఇందిరా భవన్‌లో ఖర్గే అధ్యక్షతన సమావేశం

2లో



## రూ. 1,140 కోట్ల నామినేషన్ కాంట్రాక్టులా?



- జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రి అవినీతి
- అనేక గ్రామాలు జీహెచ్ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదు
- కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు

2



## మావోయిస్టుల శకం ముగింపు

- డీజీపీ చారిత్రాత్మక ప్రకటన
- జనజీవన స్రవంతిలోకి 42 మంది మావోయిస్టులు
- డీజీపీ ఎదుట 42 మంది మావోయిస్టుల లొంగుబాటు
- తెలంగాణలో ఖాళీ అయిన అడవి

3

## ఆర్టీసీ ఉద్యోగులకు డీఏ 2.1 శాతం పెంపు

- ఉత్తర్వులు జారీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్
- 38 వేల మంది ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి
- ఏప్రిల్ జీతంతోనే పెరిగిన డీఏ బకాయిలు



హైదరాబాద్, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ఆర్టీసీ కార్మికుల కరువు భత్యాన్ని (డీఏ) 2.1 శాతం పెంచుతున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రకటించారు. తాజా పెంపుతో ఇప్పటివరకు 50.7 శాతంగా ఉన్న డీఏ, ఇప్పుడు 52.8 శాతానికి చేరింది. ఏప్రిల్ జీతంతో - మిగతా2లో

# నల్గొండ, ఖమ్మం అభివృద్ధికి కేంద్రం మద్దతు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):
తెలంగాణ రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. 'సేతు బంధన్' పథకం కింద రూ.103 కోట్లతో రెండు నూతన ప్రాజెక్టులను మంజూరు చేస్తూ కేంద్ర రోడ్డు రవాణా శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ నిధులతో నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ప్రధాన రైల్వే వంతెనల నిర్మాణం చేపట్టనున్నారు. ఇది స్థానిక రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది.
ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదకొండేళ్లుగా తెలంగాణ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కొనియాడారు. ముఖ్యంగా రోడ్డు రవాణా, రైల్వే రంగాల్లో రాష్ట్రానికి ప్రాధాన్యతనిస్తూ నిరంతరం నిధులు కేటాయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తాజాగా మంజూరైన ప్రాజెక్టులపై ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, రాష్ట్ర ప్రజల తరపున ప్రధాని మోదీకి, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, అశ్విని వైష్ణవ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

**ప్రాజెక్టుల వివరాలు, నిధుల కేటాయింపు**
కేంద్ర రోడ్డు మౌలిక సదుపాయాల నిధి (సీఆర్ఎఫ్) కింద ఈ పనులకు ఆమోదం లభించింది. వీటిలో ప్రధానంగా రెండు ముఖ్యమైన ప్రాంతాలకు లబ్ధి చేకూరనుంది:

**నల్గొండ జిల్లా:**
నార్కట్ పల్లి -- మునుగోడు రైల్వే లైన్ పరిధిలో నూతనంగా నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్.ఓ.బి) కోసం రూ.69 కోట్లు కేటాయించారు.
ఖమ్మం జిల్లా: మధిర రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే అండర్ పాస్, పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి, అలాగే అనుసంధాన రహదారుల అభివృద్ధికి రూ.34 కోట్లు ఖర్చు చేయనున్నారు.

**ప్రజలకు చేకూరనున్న ప్రయోజనాలు:**
ఈ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే పల్లెలు, పట్టణాల మధ్య రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడతాయి. రైల్వే గేట్ల వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా ఇంధన వినియోగం కూడా తగ్గుతుంది. ముఖ్యంగా రైల్వే మార్గాల వద్ద జరిగే ప్రమాదాలను నివారించడానికి ప్రయాణికుల భద్రతను పటిష్టం చేయడానికి ఈ వంతెనలు ఎంతో దోహదపడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

**సుస్థిర అభివృద్ధి వైపు అడుగులు:**
తెలంగాణలో మౌలిక సదుపాయాల బలోపేతమే లక్ష్యంగా కేంద్రం పని చేస్తోందని, రాబోయే రోజుల్లో అభివృద్ధి పనులు పట్టాలెక్కనున్నాయని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ రహదారి, రైల్వే అనుసంధాన ప్రాజెక్టులు వెన్నెముకగా నిలుస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు డీఏ 2.1 శాతం పెంపు

-మొదటిపేజీ తరువాయి
పాటే బకాయిలు పెరిగిన ఈ డీఏ జనవరి 1, 2026 నుంచి అమల్లోకి వస్తుందని మంత్రి స్పష్టం చేశారు. గత మూడు నెలల (జనవరి, ఫిబ్రవరి, మార్చి) బకాయిలను ఏప్రిల్ వేతనంతో పాటే ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 38 వేల మందికి పైగా ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. అయితే, డీఏ పెంపు కారణంగా సంస్థపై నెలకు రూ. 2.82 కోట్ల అదనపు భారం పడనుంది.

**పెండింగ్ డీఏలన్నీ క్లియర్**
గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న డీఏలన్నింటినీ తమ ప్రభుత్వం వరుసగా విడుదల చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తాజా పెంపుతో ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలన్నీ పూర్తయ్యాయన్నారు. కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని, అందుకే కారుణ్య నియామకాలు, విధులకు దూరమైన వారిని తిరిగి తీసుకోవడం, ఆర్టీసీ ఆస్పత్రి ఆధునీకరణ లాంటి ఎన్నో చర్యలు చేపట్టామని ఆయన గుర్తుచేశారు. ఆర్టీసీ వీసీ అండ్ ఎండీ వై.నాగిరెడ్డి, ఇతర ఈడీలు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ డీఏ పెంపు నిర్ణయాన్ని ప్రకటించారు. ప్రభుత్వ తాజా నిర్ణయం పట్ల ఎండీ నాగిరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, ఇది సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇంటర్ ఫలితాలకు ముహూర్తం ఖరారు

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):
తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఫలితాల సందడి మొదలైంది. ఏప్రిల్ 12న (ఆదివారం) ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను విడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 18 వరకు జరిగిన ఇంటర్ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. కాగా, తొలుత ఏప్రిల్ 11న ఫలితాలు రావచ్చని భావించినప్పటికీ, తుది ఏర్పాట్ల నేపథ్యంలో ఏప్రిల్ 12న ఫలితాలను ప్రకటించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఫలితాలు విడుదలైన వెంటనే విద్యార్థులు బోర్డు అధికారిక వెబ్‌సైట్ల(స్త్రఎఅవ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ)తో పాటు మొబైల్ యాప్స్ ద్వారా తమ మార్కులను తెలుసుకోవచ్చు. ఫలితాల్లో ఏదైనా తేడా ఉంటే రీ-కౌంటింగ్ లేదా రీ-వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు బోర్డు ప్రత్యేకంగా గడువు ఇవ్వనుంది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 1 నుంచి జూనియర్ కళాశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఈసారి రికార్డు స్థాయిలో వేగంగా ఫలితాలను వెల్లడిస్తుండటం విశేషం.

## మహిళల భద్రతకు షీ నేత్ర

**రహస్య కెమెరాల గుట్టు రట్టుకు సరికొత్త టీమ్స్**
**రంగంలోకి దిగిన 7 ప్రత్యేక బృందాలు**
**టీమ్స్‌ను ప్రారంభించిన సీపీ సజ్జనార్**



హైదరాబాద్, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):
పబ్లిక్, ప్రైవేట్ ప్రదేశాల్లో రహస్య కెమెరాలతో మహిళలను చిత్రీకరించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. అందుకోసం శుక్రవారం 'షీ నేత్ర టీమ్స్'ను రంగంలోకి దింపినట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో మహిళల భద్రతే లక్ష్యంగా షీ నేత్ర టీమ్స్‌ను ఆయన ప్రారంభించారు. భాగ్యనగరంలో 7 జోన్లకు 7 ప్రత్యేక షీ నేత్ర టీమ్స్‌ను ఏర్పాటు చేశారు సీపీ సజ్జనార్. ఆయన తన చేతుల మీదుగా ఆయా బృందాలకు కెమెరా డిటెక్టర్ల అందజేశారు. మహిళల ఆత్మగౌరవం, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే రహస్య కెమెరాల గుట్టును ఈ బృందాలు రట్టు చేయనున్నాయి. నగరవ్యాప్తంగా హోటళ్లు, మాల్స్, హాస్టళ్లు వంటి ప్రదేశాల్లో రహస్య కెమెరాలపై ఉక్కుపాదం మోపనున్నాయి. ముఖ్యంగా బట్టల దుకాణాల్లోని ట్రయల్ రూమ్స్, ప్రైవేట్ ప్రదేశాల్లో ప్రత్యేక తనిఖీలు చేయనున్నారు. ఇకపై అత్యాధునిక కెమెరా డిటెక్టర్లతో ఆకస్మిక సోదాలు నిర్వహించనున్నారు.
ఈ బృందాల ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడిన సీపీ సజ్జనార్. బట్టల దుకాణాలు, హోటళ్లు, హాస్టళ్లు, మాల్స్ వంటి ప్రాంతాల్లో ఆడవారి భద్రత ఆయా సంస్థల యాజమాన్యాలదే అని తేల్చిచెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే సంస్థలు, సిబ్బందిని బ్లాక్‌లిస్టులో పెట్టే విధంగా చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రతి సంస్థలో కస్టమర్ సేఫ్టీ ఇన్‌ఛార్జ్ నియామకం తప్పనిసరని ఆదేశాలిచ్చారు. షీ టీమ్స్‌తో సమన్వయం కోసం నోడల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఆజ్ఞాపించారు. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ సూచించారు.

## తెలంగాణ కొత్త డీజీపీగా సి.వి. ఆనంద్..?

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):
తెలంగాణ రాష్ట్రానికి కొత్త పోలీస్ బాస్ నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. 1991వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సి.వి. ఆనంద్ తెలంగాణ రాష్ట్ర తదుపరి పూర్తిస్థాయి డీజీపీగా బాధ్యతలు చేపట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో ఇన్-చార్జ్ డీజీపీగా కొనసాగుతున్న బి. శివధర్ రెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేయనుండటంతో, ఆ స్థానంలో శాశ్వత ప్రాతిపదికన కొత్త అధికారిని నియమించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నియామకం కోసం రాష్ట్రం పంపిన ఐదుగురు అధికారుల జాబితాను పరిశీలించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ముగ్గురు అధికారులతో కూడిన ప్యానెల్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఆ జాబితాలో సి.వి. ఆనంద్‌తో పాటు కేంద్ర ఇంటలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్‌గా ఉన్న వినాయక ప్రభాకర్ ఆప్టే, తెలంగాణ జైళ్ల శాఖ డీజీగా ఉన్న సౌమ్య మిశ్రాల పేర్లు ఉన్నాయి. అయితే, ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పేరు ఈ సిఫార్సు జాబితాలో లేకపోవడంతో ఆయన పదవీ విరమణ అనివార్యం కాగా, సీనియారిటీ, రాష్ట్రంలో సుదీర్ఘ కాలం వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం దృష్ట్యా సి.వి. ఆనంద్ పేరుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గతంలో రెండుసార్లు డీజీపీ పదవికి ఆయన పేరు పరిశీలనలోకి వచ్చినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల అవకాశం దక్కలేదు, కానీ ఈసారి సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం శాశ్వత ప్రాతిపదికన ఆయన నియమితులయ్యే అవకాశం ఉంది. ఈ నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఈ నెల 14వ తేదీ తర్వాత వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకవేళ సి.వి. ఆనంద్ బాధ్యతలు చేపడితే, ఆయన పదవీ కాలం 2028 మే వరకు ఉంటుంది. మరోవైపు, మహిళా అధికారులకు కూడా ప్రాధాన్యత ఇస్తూ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఒక మహిళా డీజీ స్థాయి అధికారిని నియమించాలని ప్రభుత్వం యోచిస్తోంది. హైకోర్టు ఆదేశాల ప్రకారం ఏప్రిల్ 13 నాటికి డీజీపీ నియామకంపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉండటంతో, త్వరలోనే రాష్ట్ర పోలీస్ శాఖలో ఈ కీలక మార్పు చోటుచేసుకోనుంది.

## రూ. 1,140 కోట్ల నామినేషన్ కాంట్రాక్టులా..?

హైదరాబాద్, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):
జీహెచ్ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ అనేక గ్రామాలు జీహెచ్ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. 2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మరో 1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు. నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. జీహెచ్ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు. ఈ నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు. మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని ప్రజలు ఆయన్ను ఎప్పుడో మర్చిపోయారని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాను. ఎవరో చెప్తే పార్టీ పెట్టే స్థాయిలో లేను అని కవిత స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నానమని అన్నారు. అయితే, కమీషన్ల కోసమే రిపేర్ చేయాలని ప్రభుత్వం భావిస్తోందని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కేరళం ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తాము వీడియో రిలీజ్ చేశామని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

## ఢిల్లీలో సీడబ్ల్యూసీ భేటీ

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):
ఢిల్లీ లోని ఇందిరా భవన్ లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరయ్యారు సీఎం రేవంత్ రెడ్డి. శుక్రవారం మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు కాంగ్రెస్ కీలక నేతలు హాజరయ్యారు. నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. మహిళా రిజర్వేషన్ల అంశంపై కూడా ఈ సమావేశంలో చర్చినట్లు సమాచారం. ఏప్రిల్ 16 నుంచి 18 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఉన్న క్రమంలో సీడబ్ల్యూసీ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అంశంపై పార్లమెంటులో చర్చించి చట్టసవరణ చేసేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తోంది కేంద్రం. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో పార్టీ అనుసరించాల్సిన విధానాలు, పార్టీ లైన్ పై సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

## గులాబీ గూటికి సీనియర్ నేత జీవన్ రెడ్డి

-మొదటిపేజీ తరువాయి
నివాసానికి చేరుకున్న జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు ఘనస్వాగతం పలికారు. కేసీఆర్ నివాసంలోకి అడుగుపెట్టిన జీవన్ రెడ్డిని చూడగానే గులాబీ అధినేత సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యారు. "అన్నా.. తెలంగాణకు నష్టం జరుగుతున్న ఈ సమయంలో మీతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. అందుకే మీతో కలిసి పని చేయమని ఆ దేవుడే నన్ను మీ దగ్గరికి పంపిండు. చాలా గ్యాప్ తర్వాత ఇన్నాళ్లకైనా మీతో కలిసి పనిచేసే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది అన్నా.. అంటూ మనసులోని మాటను వ్యక్తం చేస్తూ కళ్లవెంట నీళ్లు పెట్టుకున్నారు. దీంతో కేసీఆర్ వెంటనే ఆయనను అనునయిస్తూ, అప్యాయంగా దగ్గరకు తీసుకుని హృదయపూర్వక ఆలింగనం చేసుకున్నారు. అనంతరం జీవన్ రెడ్డిని దుశ్శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ భేటీలో కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డా. కె. సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. జీవన్ రెడ్డి వెంట ఆయన కుమారులు, జగిత్యాల మాజీ జడ్పీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు కూడా ఉన్నారు. కాసేపు ఇష్టాగోష్టిగా మాట్లాడుకున్న అనంతరం, కేసీఆర్ స్వయంగా జీవన్ రెడ్డి బృందానికి మధ్యాహ్న భోజన ఆతిథ్యం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతగా ఉండి, తెలంగాణ తనానికి దర్పణంగా నిలిచే జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం, కేసీఆర్‌ను "అన్నా" అని సంబోధిస్తూ భావోద్వేగానికి లోనవ్వడం చూస్తుంటే.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంభవించబోతున్నాయని స్పష్టమవుతోంది.

## కుల గణన నిలిపివేతకు సుప్రీంకోర్టు నో

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్)
కుల గణనను నిలిపివేయాలని కేంద్రాన్ని ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జయమల్య బాగ్చి, విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. ఒక్క బిడ్డ ఉన్న కుటుంబాలకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించేందుకు విధానాలను రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించాలని కూడా ఈ పిటిషన్‌లో కోరారు. 2027 సార్వత్రిక జనాభా లెక్కలలో పౌరుల కుల సమాచారాన్ని నమోదు చేయడం, వర్గీకరించడం మరియు ధృవీకరించడం కోసం అనుసరించాల్సిన విధానాన్ని ప్రశ్నిస్తూ దాఖలైన ఒక ప్రత్యేక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిఐఎల్) విచారణకు స్వీకరించడానికి ఫిబ్రవరి 2వ తేదీన సుప్రీంకోర్టు నిరాకరించింది. అధికారికంగా 16వ జాతీయ జనాభా లెక్కలైన 2027 జనాభా లెక్కలు, 1931 తర్వాత సమగ్ర కుల గణనను చేర్చిన మొట్టమొదటిది కానుంది, మరియు ఇది దేశంలోనే మొట్టమొదటి పూర్తి డిజిటల్ జనాభా లెక్కలు కూడా అవుతుంది.

## తప్పుడు ప్రచారం చేస్తే ఖబడ్దార్

-మొదటిపేజీ తరువాయి
నాశనం అవుతారు.. బాగుపడరంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆధారాలు లేకుండా మాట్లాడితే లీగల్ చర్యలు తీసుకుంటామన్నారు. తాజాగా మంత్రి సీతక్క కొత్తగూడెం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా 1,954 మంది అంగన్‌వాడీ సిబ్బందికి సెల్ ఫోన్లు, బేటీ బచావో -- బేటీ పఢావో కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పాల్గొన్నారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వ గైడ్ లైన్స్ ప్రకారమే ఫోన్లను కొనుగోలు చేయడం జరిగింది. కావాలనే కొందరు పిచ్చి ప్రేలాపణలు చేస్తున్నారు. కేంద్రం ఇచ్చిన ధర మేరకు ఓపెన్ టెండర్లు, ఆన్లైన్ టెండర్ల ద్వారా ఆహ్వానించి ఫోన్లను అతితక్కువ ధరకు కొనుగోలు చేశాం. పిచ్చి పిచ్చిగా వాగుతూ నోటికి వచ్చిన విధంగా ఆధారాలు లేకుండా మాట్లాడేవారిపై కోర్టు ద్వారా లీగల్ గా చర్యలు తీసుకుంటాం. మాలాంటి వాళ్ళను అంటే నాశనం అవుతారు, బాగుపడరు" అంటూ తీవ్ర స్థాయిలో స్పందించారు. 11,650 రూపాయలకే సెల్ ఫోన్ కొనుగోలు చేస్తే.. కావాలని 14 వేలకు కొన్నాం అని విష ప్రచారం చేస్తున్నారు. ఇలాగే అన్యాయంగా మా మీద ఆరోపణలు చేసిన వారు మూడు నెలలకే కింద పడి శిక్ష అనుభవించారు. మేము కేవలం ప్రజలకు మాత్రమే జవాబుదారీగా ఉంటాం. అంగన్‌వాడీల కొరకు అన్ని రకాల ప్రయోజనాలు కల్పిస్తుంటే.. కావాలనే ఒక సంఘం రోడ్డు మీదకు వస్తుంది, అది చూసి మరొకటి వస్తుంది. ఇలాంటి సంఘాలను అంగన్‌వాడీలు నమ్మాల్సిన పనిలేదు. నేను అందరికీ అందుబాటులో ఉంటాను, ఎవరికైనా ఏదైనా సమస్య ఉంటే డైరెక్ట్ గా నా దగ్గరకు రావచ్చు. అంగన్‌వాడీల సమస్యలన్నింటినీ పరిష్కరించే బాధ్యత నేను, మా ప్రభుత్వం తీసుకుంటుంది అని హామీ ఇచ్చారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుండి అంగన్‌వాడీల జీతాల విషయంలో సహకారం అందడం లేదు. ఈ సమస్యపై పలుమార్లు కేంద్ర మంత్రిని సైతం కలిశాము. అంగన్‌వాడీ టీచర్లకు ఎప్పటికీ ఒకేలా ఉండేలా యూనిఫామ్‌లను అందజేస్తాం. హైదరాబాద్ లాంటి నగరాల్లో ముందు ముందు మొబైల్ అంగన్‌వాడీలను సైతం ఏర్పాటు చేయనున్నాం అని సీతక్క తెలిపారు.

## మహిళా ఉద్యోగుల రక్షణకు సర్కార్ అడుగు

**సచివాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు**
**ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్**



తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):
మహిళా ఉద్యోగుల రక్షణకు తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలులో భాగంగా తెలంగాణ సచివాలయ సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లో అంతర్గత ఫిర్యాదుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఏప్రిల్ 9న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వి.డి. సుధారాణి (ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి), సభ్యులుగా జి. శైలజ (సహాయ కార్యదర్శి), టి. లక్ష్మీ ప్రసన్న (సెక్షన్ ఆఫీసర్), ఆయేషా తబస్సుమ్ (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్)లను సైతం నియమించారు.

**కమిటీ ప్రధాన విధులు**
జీఏడీలో పనిచేసే మహిళా ఉద్యోగుల నుంచి వచ్చే లైంగిక వేధింపుల ఫిర్యాదులను ఈ కమిటీ స్వీకరిస్తుంది. వాటిపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తదుపరి క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రభుత్వానికి ఒక సమగ్ర నివేదికను అందజేస్తుంది.

# మావోయిస్టుల శకం ముగింపు

హైదరాబాద్ ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):
మావోయిస్టు పార్టీకి తెలంగాణలో కోలుకోలేని దెబ్బ తగిలింది. దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న సాయుధ పోరాటానికి తెరదించుతూ పీఎల్‌జీఏ బెటాలియన్ సభ్యులు భారీ సంఖ్యలో జనజీవన స్రవంతిలో చేరారు. తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి.శివధర్ రెడ్డి ఎదుట శుక్రవారం 42 మంది మావోయిస్టులు తమ ఆయుధాలతో సహా లొంగిపోయారు. ఈ లొంగుబాటులో అత్యంత ప్రధానమైన వ్యక్తి పీఎల్‌జీఏ బెటాలియన్ డిప్యూటీ కమాండర్ కేశాలు. బెటాలియన్ కమాండర్ దేవన్న ఇప్పటికే లొంగిపోవడంతో, కేశాలు నేతృత్వంలో కొనసాగుతున్న ఈ బృందం తాజాగా పోలీసులకు లొంగిపోయింది. వీరితో పాటు డివిజనల్ కమిటీ సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు కూడా ఉన్నారు.

**ఆయుధాల అప్పగింత**

లొంగిపోయిన మావోయిస్టులు తమ వెంట తెచ్చిన సుమారు 40 అత్యాధునిక ఆయుధాలను (ఏకే -47, ఇన్సస్, ఎస్ఎల్ఆర్ వంటివి) డీజీపీకి అప్పగించారు. లొంగిపోయిన 42 మందిలో 41 మంది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు కాగా, తెలంగాణకు చెందిన వారు కేవలం ఒక్కరు మాత్రమే ఉన్నారని డీజీపీ స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఇటీవల భద్రతా బలగాల కూంబింగ్ తీవ్రతరం కావడంతో, తెలంగాణ సురక్షితమైన ప్రాంతంగా భావించి తెలంగాణ పోలీసులను ఆశ్రయించినట్లు మావోయిస్టులు తెలిపారు.

**తెలంగాణ ఇక “మావోయిస్టు రహిత” రాష్ట్రం!**

ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి ఒక చారిత్రాత్మక ప్రకటన చేశారు. ఈ భారీ లొంగుబాటుతో తెలంగాణలో పీఎల్‌జీఏ బెటాలియన్ పూర్తిస్థాయిలో కనుమరుగైంది. ప్రస్తుతం రాష్ట్రంలో క్రియాశీలక మావోయిస్టు కేడర్ ఎవరూ లేరు. దీనితో తెలంగాణ ఇప్పుడు పూర్తిస్థాయిలో ‘మావోయిస్టు రహిత’ రాష్ట్రంగా అవతరించిందని గర్వంగా ప్రకటిస్తున్నాను అని పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్షణ ఆర్థిక సాయం, పునరావాసం కల్పిస్తామని డీజీపీ హామీ ఇచ్చారు. అడవుల్లో ఇంకా మిగిలి ఉన్న వారు కూడా ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**మావోయిస్టు పేరు/వయసు**

1. సోడి మల్ల ఏ కేశాల్ ఏ నిఖిల్ (47 ఏళ్లు)
2. మడవి మాడ ఏ రవీందర్ (30 ఏళ్లు)
3. పునేం సుక్కు (35 ఏళ్లు)
4. హేమ్లా లచ్చి ఏ మాసే ఏ శీల (40 ఏళ్లు)
5. సోడి భీమా ఏ రంజిత్ (25 ఏళ్లు)
6. తాటి రాజు ఏ రంజిత్ (28 ఏళ్లు)
7. కోవ్వాసి రాజు ఏ రమేష్ (28 ఏళ్లు)
8. మూడియం భీమా ఏ రింకు (26 ఏళ్లు)
9. మడకం భీమా ఏ సునిత (28 ఏళ్లు)
10. పొడియం గంగి ఏ సుందరి (25 ఏళ్లు)
11. సోడి భీమి ఏ మాలతి (30 ఏళ్లు)
12. కుడం దేవి (24 ఏళ్లు)
13. మడకం జోగి (28 ఏళ్లు)
14. పునేం ఐతె ఏ పార్వతి (27 ఏళ్లు)
15. పొడియం సుంబారి ఏ అంజలి (20 ఏళ్లు)
16. మడకం ఇడుమ ఏ నరేష్ (24 ఏళ్లు)
17. కుంజం భీమా (23 ఏళ్లు)
18. మడకం ఇడుమ (23 ఏళ్లు)
19. మడవి జోగా (25 ఏళ్లు)
20. కుంజం సోను ఏ నవీన్ (20 ఏళ్లు)
21. పునేం సోము ఏ రాకేష్ (20 ఏళ్లు)
22. చాప నారాయణ ఏ గజేందర్ ఏ మధు (40ఏళ్లు)
23. కడి సన్ను ఏ మంతు (40 ఏళ్లు)
24. మోడియం మున్ని ఏ మంజుల (43 ఏళ్లు)
25. కుంజం ఇడుమాల్ ఏ మహేందర్ (30 ఏళ్లు)
26. సుపో డొంగ ఏ సునీల్ (30 ఏళ్లు)
27. పొడియం లక్ష్మి (28 ఏళ్లు)
28. ముస్సాకి దేవే (30 ఏళ్లు)
29. డోడ్డి సోముడు ఏ శంకర్ (26 ఏళ్లు)
30. మడవి సోమిడి ఏ లత (23 ఏళ్లు)
31. కరటం ఉరే ఏ రంజిత (22 ఏళ్లు)
32. పునేం రామే ఏ క్రాంతి (20 ఏళ్లు)
33. పునేం మోట్టు ఏ జగ్గు (30 ఏళ్లు)
34. డోడ్డి ఐతు ఏ కిశోర్ (40 ఏళ్లు)
35. గోన్నే హిడిమె (22 ఏళ్లు)
36. కుంజం లచ్చు (28 ఏళ్లు)
37. పూనేం శాంతి ఏ సునీత (30 ఏళ్లు)
38. మడకం బుద్ర (45 ఏళ్లు)
39. కుంజం భీమా (30 ఏళ్లు)
40. మడకం ఉంగి (21 ఏళ్లు)
41. రవ్వా సన్నా ఏ గుడ్డు (18 ఏళ్లు)
42. ఆప్కా శ్రీను (20 ఏళ్లు).

# పాకిస్థాన్ గూఢచార మాడ్యూల్ గుట్టురట్టు చేసిన ఢిల్లీ పోలీసులు

భారీ టెర్రర్ మాడ్యూల్‌ను ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ శుక్రవారం ఛేదించింది. పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్న 11 మందిని అధికారులు అరెస్టు చేశారు. పాకిస్థాన్‌కు చెందిన ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ) కనుసన్నల్లో ఈ ముఠా పని చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ముఠా ప్రధానంగా గూఢచర్యం, ఆయుధాల అక్రమ రవాణా, సైనిక స్థావరాలపై రహస్య పరిశీలన వంటి కార్యకలాపాల్లో నిమగ్నమై ఉందని అధికారులు తెలిపారు. ఈ ముఠా సైనిక స్థావరాల కదలికలను కనిపెట్టడానికి సోలార్ పవర్‌తో నడిచే సీసీటీవీ కెమెరాలను రహస్యంగా ఏర్పాటు చేసినట్లు గుర్తించిన అధికారులు విస్తుపోయారు. పంజాబ్, హరియాణ, జమ్ముకశ్మీర్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని సున్నిత ప్రాంతాల వద్ద సౌరశక్తితో పనిచేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తెలిసింది. ఇప్పటివరకు దాదాపు 9 కెమెరాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు అధికారులు. ఈ కెమెరాలు మొబైల్ యాప్‌ల ద్వారా పాకిస్థాన్‌లో ఉన్న హ్యాండ్లర్లకు లైవ్ వీడియో పంపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఫేక్ ఐడీలతో సిమ్ కార్డులు తీసుకుని ఈ వ్యవస్థను నిర్వహించినట్లు తెలిసింది. ఈ ముఠా పంజాబ్‌లోని జలంధర్, పఠాన్‌కోట్, కపుర్తల, పాటియాలా, మోగా, హరియాణాలో అంబాలా, జమ్ముకశ్మీర్‌లో కథువా, రాజస్థాన్‌లో బికనేర్, అల్వార్ వంటి ప్రాంతాల్లో కెమెరాలు అమర్చినట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో సైనిక దళాల రాకపోకలు ఎక్కువగా ఉండటం, అంతర్జాతీయ సరిహద్దులకు సమీపంగా ఉండటం వల్లే ముఠా వాటిని లక్ష్యంగా




ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

**రెండు ఆపరేషన్స్**

పోలీసులు ఈ ఉగ్రముఠాను రెండు ఆపరేషన్స్‌లో ఛేధించారు. స్పెషల్‌సెల్ నార్త్ రేంజ్ బృందాల నేతృత్వంలో జరిగిన మొదటి ఆపరేషన్‌లో పంజాబ్, ఢిల్లీకి చెందిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. వీరివద్ద నుంచి 9 సీసీ కెమెరాలు, 4 తుపాకులు, 24 కార్ట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు సౌత్ వెస్ట్ రేంజ్ నిర్వహించిన రెండో ఆపరేషన్‌లో పంజాబ్‌లో మరో ఐదుగురిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీసుల విచారణలో నిందితులు కీలక విషయాలను వెల్లడించారు. ఆయుధాలు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ద్వారా వచ్చే డబ్బుతో తమను ఈ నెట్‌వర్క్‌లోకి ఆకర్షింపజేశారని నిందితులు పోలీసుల విచారణలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, పంజాబ్‌లోని తార్న్ తారన్‌కు చెందిన మన్‌ప్రీత్ సింగ్ అనే వ్యక్తి ఈ ముఠాలో ప్రధాన నిందితుడిగా పోలీసులు గుర్తించారు. మఁప్రీత్ పాక్ హ్యాండ్లర్లతో నేరుగా సంబంధాలు కొనసాగిస్తూ ఆయుధాల సరఫరా, కమ్యూనికేషన్ వ్యవస్థను సమన్వయం చేయడంలో ఇతను కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు.

**కీలక ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి పాక్?కు చేరవేత**

దీర్ఘకాలిక గూఢచార కార్యకలాపాలను కొనసాగించడానికి స్థానిక యువతను నియమించుకోవడం, వారితో తమ నెట్‌వర్క్‌ను విస్తరించడం వంటి బాధ్యతలను కూడా ఈ మాడ్యూల్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో కొందరు ఆర్మీ కంటోన్మెంట్ల వద్ద రెక్కీ నిర్వహించడం, సరిహద్దు అవతల ఉన్న హ్యాండ్లర్లతో ఫొటోలు, వీడియోలను పంచుకోవడంలో ఈ ముఠా ప్రధాన పాత్ర పోషిస్తునట్లు గుర్తించారు. ఈ క్రమంలో అన్మోల్ అనే నిందితుడు తన సహచరుడు సాహిల్, పలు ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసే బాధ్యత తీసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడి అయ్యింది. వీటితో పాటు పోలీసుల దర్యాప్తులో మరికొన్ని కీలక విషయాలు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ మాడ్యూల్ భద్రతా స్థావరాలపై గ్రెనేడ్లతో దాడులు చేయాలని కూడా ప్రణాళికలు రచించినట్లు సమాచారం. అయితే, ఈ అరెస్టులతో పెద్ద ఉగ్రదాడిని ముందుగానే అడ్డుకున్నామని అధికారులు తెలిపారు. కాగా, సీసీటీవీ డేటా, మొబైల్ ఫోన్లలోని సమాచారాన్ని విశ్లేషిస్తూ మరిన్ని లింకులు వెలికితీయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.

# గృహ గణనలో ఇప్పటికే 5.72 లక్షల కుటుంబాల సెల్ఫ్ ఎన్యుమరేషన్

2027 జనగణన తొలి విడతలో భాగంగా నిర్వహిస్తున్న గృహ గణన(హూ)లో ఇప్పటివరకు 5.72 లక్షలకు పైగా కుటుంబాలు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని వినియోగించుకున్నాయి. ఈ విషయాన్ని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ వెల్లడించారు. ఈ అంశం జనగణనతో ముడిపడిన డిజిటల్ సదుపాయాల్లో పెరుగుతున్న ప్రజా భాగస్వామ్యాన్ని అద్దం పడుతోందని ఆయన తెలిపారు. లక్షలాది కుటుంబాలు ఆన్‌లైన్‌లోనే గృహ గణన సమాచారాన్ని సమర్పించడం ద్వారా దేశ నిర్మాణం కోసం వేగవంతమైన, స్మార్ట్‌గా, సౌకర్యవంతంగా ఉండే మార్గాన్ని ఎంచుకున్నారని చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆర్‌జీఐ ఒక ట్వీట్ చేశారు.

**స్వీయ గణన - ఐడీ జనరేషన్ - వెరిఫికేషన్**

దేశంలో తొలి విడత గృహ గణన ప్రక్రియ ఏప్రిల్ 1న 5 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రారంభమైంది. ఈ జాబితాలో గోవా, కర్ణాటక, మిజోరాం, ఒడిశా, సిక్కిం, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఢిల్లీ (న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ - ఛీణవీజ ప్రాంతం, ఢిల్లీ కంటోన్మెంట్ బోర్డు పరిధి మాత్రమే) ఉన్నాయి. ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని కుటుంబాలు ఏప్రిల్ 1 నుంచి 15 వరకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. కుటుంబాలకు స్వీయ గణన చేసుకునే అవకాశాన్ని ఇవ్వడం ఇదే తొలిసారి. ఇందుకోసం ప్రత్యేక పోర్టల్‌ను (https://se.census.gov.in/) రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా అందుబాటులోకి తెచ్చింది. దీనిలో అడిగే ప్రశ్నలకు ప్రజలు స్వయంగా సమాధానాలను నమోదు చేయొచ్చు. అన్ని ప్రశ్నలకు సమాధానాలను ఇచ్చాక, ఎస్ఈ ఐడీ (Self-Enumeration ID) జనరేట్ అవుతుంది. తదుపరిగా ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు జరగనున్న డోర్ టు డోర్ గృహ గణన సందర్భంగా వెరిఫికేషన్ కోసం తమ ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు ఎస్ఈ ఐడీని ప్రజలు అందిస్తారు.




**ప్రత్యేక మొబైల్ యాప్ - ప్రతీ కుటుంబానికి 33 ప్రశ్నలు**

మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరుగుతున్న 8వ జనగణన ఇది. దీన్ని రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు విడతలవారీగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో(యూటీలు) గృహ గణన జరుగుతుంది. రాష్ట్రాలు, యూటీలు తమ సౌలభ్యాన్ని బట్టి గరిష్ఠంగా 30 రోజులు కూడా ఈ ప్రక్రియను నిర్వహించుకోవచ్చు. తొలుత అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 15 రోజుల పాటు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) కోసం ప్రజలకు అవకాశం ఇస్తారు. ఆ గడువు ముగిసిన మరుసటి రోజు నుంచే ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ మొదలుపెడతారు. ప్రతీ ఇంటికి చెందిన కుటుంబాన్ని 33 ప్రశ్నలు అడిగి సమాధానాలను నమోదు చేస్తారు. కుటుంబ పెద్ద సమాచారం, పేరు, లింగం, ఇంటి యాజమాన్యం వివరాలు, ఇంట్లోని కనీస వసతులపైనే ఈ ప్రశ్నలన్నీ ఉంటాయి. ఈ సమాచారం నమోదు కోసం ఎన్యుమరేటర్లు ప్రత్యేక మొబైల్ యాప్‌ను వినియోగిస్తారు. మొత్తం మీద ఈ ప్రక్రియ పూర్తిగా డిజిటల్‌గా జరుగుతుంది. ఇక జనగణన రెండో దశ 2027 ఫిబ్రవరిలో మొదలవుతుంది. అయితే మంచుతో కూడిన లద్ధాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి చోట్ల 2026 సెప్టెంబరులోనే జనగణన రెండో దశ ప్రక్రియను నిర్వహిస్తారు.

**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎప్పుడు?**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ వేర్వేరు తేదీల్లో జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ కాలపరిమితి ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 30 వరకు ఉంటుంది. ఇంటింటి సర్వే మే 1 నుంచి మే 30 వరకు జరుగుతుంది. తెలంగాణలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ కాలపరిమితి ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు ఉంటుంది. ఇంటింటి సర్వే మే 11 నుంచి జూన్ 9 వరకు జరుగుతుంది. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసేటప్పుడు ఎలాంటి డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు.

## మహిళలకు, నిరుద్యోగులకు రూ.3000 ఆర్థిక సాయం

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీజేపీ శుక్రవారం విడుదల చేసిన తన మేనిఫెస్టోలో వరాల జల్లు కురిపించింది. బీజేపీ కనుక అధికారంలోకి వస్తే చొరబాటుదారులపై కఠిన వైఖరి అవలంబిస్తామని స్పష్టం చేసింది. బంగాల్?లోని ప్రతి మహిళకు, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన 45 రోజుల్లోనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఏడో వేతన సంఘం ఏర్పాటు చేస్తామని పేర్కొంది. బంగాల్ ఎన్నికల కోసం బీజేపీ శుక్రవారం సంకల్ప పత్రం (మేనిఫెస్టో) విడుదల చేసింది. ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ సంకల్ప పత్రం రైతులు, మహిళలు, యువతకు మార్గనిర్దేశం చేస్తుందని అన్నారు. బంగాల్ సంస్కృతిని చూసి గర్వపడే ప్రతి పౌరుడికి ఇది సరికొత్త ఆశలు కల్పిస్తుందన్నారు. ఈ పత్రం ‘సోనార్ బంగ్లా’ (బంగారు బంగాల్) సృష్టికి ఒక రోడ్ మ్యాప్ అని పేర్కొన్నారు.

**మహిళలను ఆకట్టుకునేందుకు!**

మహిళా ఓటర్లను ఆకట్టుకులనేందుకు, రాష్ట్రంలోని మహిళలకు నెలకు రూ.3వేలు చొప్పున నగదు బదిలీ చేస్తామని తమ బీజేపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. అలాగే పోలీస్ ఫోర్స్‌తో సహా అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని పేర్కొన్నారు.

**మమతపై విమర్శల జల్లు**

మరోవైపు అధికారంలో ఉన్న మమత బెనర్జీ ప్రభుత్వంపై అమిత్? షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత 15 ఏళ్ల తృణమూల్? కాంగ్రెస్? పాలన ప్రజలకు ఒక పీడకలగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపించారు. “ప్రజలు ఎంతో ఆశతో మమతా దీదీకి అధికారం ఇచ్చారు. కానీ ఈ రోజు వారే మార్పు కోరుకుంటున్నారు” అని అన్నారు.

## రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన నీతీశ్ కుమార్

బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ రాజ్యసభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంటు భవనంలో రాజ్యసభ ఛైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. నీతీశ్ హిందీలో ప్రమాణం చేయగా ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రులు జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్, అర్జున్ రామ్ మేఘవాల్‌తో పాటు జేడీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, కాంగ్రెస్ నేత జైరాం రమేష్ సహా తదితరులు హాజరయ్యారు. నీతీష్ కుమార్ రాజ్యసభకు ఎన్నుకోవడంతో బిహార్‌లో దాదాపు రెండు దశాబ్దాల పాటు సాగిన ఆయన ప్రస్థానం ముగిసినట్లే అని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 14న చీ.ఙ.ూా కూటమి బిహార్‌కు కొత్త సీఎంను ఎన్నుకోనుంది. ఈ మేరకు ప్రస్తుతం ఉపముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరిని సీఎం పదవి వరించే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది.

## ఇంధన భద్రతపై గల్ఫ్ దేశాలతో చర్చలు

ఇంటర్నెట్ డెస్క్: లెబనాన్‌లో ఇజ్రాయెల్ కొనసాగిస్తోన్న దాడులపై భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడుల్లో అనేక మంది ప్రజలు ప్రాణాలు కల్పోవడం బాధాకరమన్నారు.



పశ్చిమాసియాలోని పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని.. లెబనాన్‌లోని భారత పౌరుల భద్రతపై ఎప్పటికప్పుడు అక్కడి భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తున్నారని రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. ఈ మేరకు ఖతార్‌తో ఒప్పందం చేసుకొనేందుకు చర్చలు కొనసాగుతున్నాయన్నారు. అదే సమయంలో పొరుగు దేశాల ఇంధన అవసరాలనూ తీర్చడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెండు వారాల క్రితం భారత్.. శ్రీలంకకు 38 మెట్రిక్ టన్నుల పెట్రోలియం ఉత్పత్తులను సరఫరా చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ సముద్ర జలాల్లో చిక్కుకుపోయిన భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలో ఎల్‌పీజీ, పెట్రోల్ ఇతర ఇంధన నిల్వలకు ఎటువంటి కొరతా లేదని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ పేర్కొన్నారు. పెట్రోల్ బంకులలో తగినంత నిల్వలు ఉన్నాయని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా సాధారణంగానే ఉందన్నారు.

## శాంతి చర్చలవేళ పాకిస్థాన్‌లో హైఅలర్ట్.. ఇస్లామాబాద్‌లో రెడ్ జోన్‌కు మూత..!




అమెరికా-ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినా.. పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు మాత్రం ముగిసిపోలేదు. కాల్పులు విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులు చేయడం, అందుకు ప్రతిగా ఇరాన్ హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేయడం లాంటి పరిణామాలు ఉద్రిక్తతలను పెంచాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు శాంతి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. ఏప్రిల్ 11న రాజధాని ఇస్లామాబాద్‌లో చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ హై అలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ భవనాలు, కీలక రహదారి మార్గాల వద్ద భద్రతా బలగాలు పహారా కాస్తున్నాయి. రాజధానిలోని రెడ్‌జోన్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రత కొనసాగుతోంది. అక్కడ పరిమిత సంఖ్యలోనే జనసంచారం కనిపిస్తోంది. అంటే ఒక రకంగా రెడ్‌జోన్‌ను పూర్తిగా సీల్ చేశారు. అంటే మూతవేశారు. ఇస్లామాబాద్‌లో ఉన్న పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హోటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలు ఉన్న ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా పిలుస్తారు. శాంతి చర్చల నేపథ్యంలో ఇప్పుడు ఇస్లామాబాద్‌లో సెలవు ప్రకటించారు. దుకాణ సముదాయాలు కూడా మూతపడ్డాయి. తమ మధ్యవర్తిత్వంతోనే అమెరికా-ఇరాన్ దేశాల మధ్య రెండు వారాలపాటు కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని పాకిస్థాన్ చెప్పింది. ఇప్పుడు ఆ రెండు దేశాల మధ్య శాంతి చర్చలకు ఆతిథ్యం ఇస్తోంది. ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ నేతృత్వంలోని బృందం అమెరికా తరఫున చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తున్నది. ఇక ఇరాన్ వైపు నుంచి విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ పాకిస్థాన్ బయలుదేరారంటూ అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. అయితే ఈ వార్తలను ఇరాన్ ఖండించింది. ఆ ఇద్దరూ తమ రాజధాని టెహ్రాన్‌లోనే ఉన్నారని తెలిపింది.

తీన్మార్

# ఏకధ్రువ ప్రపంచానికి చెక్ పెట్టినట్లేనా!

ప్రతిమనిషి పుట్టుకతోనే జీవించే హక్కుతో భూమిమీదకు వస్తాడు. మరణం అనేది ఆ హక్కుకు దూరం కావడమే! సాధారణ మరణం సహజ ప్రక్రియ. యుద్ధ మరణం అనేది ఉన్మాద చర్యతో జీవించే హక్కును అర్ధాంతరంగా తుంచివేయడం. అందుకే ఏరకమైన యుద్ధమైనా వినాశ హేతువే? యుద్ధం ఒక పీడకచర్య. యుద్ధ మరణాలకు హేతుబద్దత ఉండదు. మధ్యయుగాలలో యుద్ధమంటే వీరత్వానికి ప్రతీక. అటు తర్వాత ఆయుధం ప్రధానపాత్ర వహించింది. అధికారానికి ఆయుధం ప్రాకారంగా నిలిచింది. సాంకేతికత అభివృద్ధి చెందిన ఈ దశలో ఆయుధానిదే పైచేయి అయింది. ఇప్పుడు యుద్ధ వ్యూహాల్లో మార్పులొచ్చాయి. ఒకప్పుడు రష్యా, అమెరికా ప్రచ్ఛన్న యుద్ధస్థితి నుంచి, రష్యా అంతర్గత రాజకీయ మార్పుల తర్వాత అమెరికా ఏకధృవ ప్రపంచంగా ఎదిగింది. అంతేకాదు, తమ భూభాగంలో కాకుండా ప్రపంచం మొత్తం యుద్ధ స్థావరాలు ఏర్పరచుకొని, సైన్యాన్ని మోహరించి ప్రపంచ పోలీసుగా పెత్తనం చేస్తోంది. జనరల్ గడాఫీ, అలెండీ, సద్దాం హుస్సేన్ లాంటి ఎందరో దేశాధినేతలను హత్య చేయడంతో పాటు, ఆసియా, అమెరికా, ఆఫ్రికా ఖండాల్లో అనేక దేశాలతో యుద్ధాలు చేసింది. చివరకు తమ వ్యాపార సామ్రాజ్యానికి పోటీరాకుండా జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అణుబాంబులు వేసి సాముహిక మానవహననానికి అమెరికా పాల్పడింది. వియత్నాంతో పదహారేళ్ల సుదీర్ఘ యుద్ధం తర్వాత అమెరికా దూకుడుకు కళ్లెం పడింది. ఇప్పుడు ఇరాన్‌తో భూతల యుద్ధంతో తలపడడం అంటే చావునోట్లో తలపెట్టడమేనన్న వ్యవహారం అర్థమైన తర్వాత ఇంటా, బయట ఏకాకిగా మారిన ట్రంప్, వ్యూహం మార్చి ఇరాన్‌తో సీజ్ ఫైర్‌కు తాపత్రయ పడ్డాడు. వ్యూహాత్మకంగా ఊపిరి పీల్చుకోవడానికి ఇరాన్ కూడా పది షరతులతో సిద్ధమైంది. సీజ్‌ఫైర్ అనబడే ఒప్పందం అనేది ఇటీవల కాలంలో ముందుకొచ్చిన దౌత్య ప్రక్రియనే. ఒకప్పుడు గ్రూపుల మధ్య ఒప్పందం ఇప్పుడు దేశాల మధ్యకు మారింది. భారత్-పాకిస్తాన్, ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాలలో ట్రంప్ ముందుకు తెచ్చిన ప్రక్రియనే ఇది. కొత్తదేం కాదు, కాకుంటే ఓటమి అంచుల్లో పరువు దక్కించుకునే ఏకైక సూచిక! ట్రంప్ రెండువారాల యుద్ధ వెసులుబాటుకు ప్రయత్నమే ఆయనలో నెలకొన్న ఓటమి భయానికి నిదర్శనం. ఇరాన్‌లో 240మంది మహిళలు, 212 మంది పిల్లలు వెరసి 2076 మంది ప్రజలు యుద్ధంలో మరణించారు, 26,500 ప్రజలు గాయపడ్డారు. మిత్రదేశం లెబనాన్‌లో మరో 13వందల మంది ప్రజలను ఇజ్రాయిల్ చంపేసింది. అంతేకాదు, యుద్ధ ప్రారంభంలోనే ఇజ్రాయిల్, అమెరికా కుట్రపూరితంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయుతుల్లా ఖొమైనీని అంతం చేసింది. అయినా ఇరాన్ తమ మౌలిక వనరుల రక్షణ దృష్టితో సీజ్‌ఫైర్‌కు అంగీకరించింది. సుదీర్ఘ కాలం తమవెంట ఉన్న పశ్చిమ యూరప్ దేశాల యుద్ధ కూటమి "నార్త్ అట్లాంటిక్ ట్రిటీ ఆర్గనైజేషన్' నాటోలోని 30 దేశాలు ఇరాన్‌పై ట్రంప్ దాడికి మద్దతివ్వలేదు. సరికదా కొన్ని దేశాలు నేరుగా ఇరాన్‌కు మద్దతు తెలిపాయి. ఇక ప్రపంచ దేశాల ప్రజలతో పాటు, తనదేశంలో ప్రజలు నిరసన పతాకస్థాయికి చేరడంతో ట్రంప్ ఓ అడుగు సీజ్‌ఫైర్ పేరుతో వెనక్కి తగ్గాడు తప్ప, తనలోని యుద్ధ పిపాసి ఇంకా చావలేదు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత పిచ్చోడి చేతిలో రాయిలా ప్రపంచ దేశాలపై టారిఫ్‌ల పేరుతో విరుచుకుపడ్డాడు. గాజా విషయంలో ఇజ్రాయిల్ అమానుష కాండకు పరోక్షంగా మద్దతిచ్చాడు. పనామా అధ్యక్షుడు నోరిగోను మాదకద్రవ్యాల పేరుతో జైలు శిక్ష వేసి నిర్భందించాడు."ఆపరేషన్ అబ్జార్వేట్ రిజర్వ్" పేరుతో ప్రజలచేత ఎన్నికైన వెనెజులా అధ్యక్షుడు మదురో, ఆయన భార్య సిలియాలను అర్ధరాత్రి ఇంటినుంచి కిడ్నాప్ చేసి అమెరికా జైలులో నిర్భంధించాడు.కేవలం ఆయిల్‌పై నియంత్రణ కోసం ఒకదేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకం చేయడమే కాక, తన పదవీ కాలం ముగిసిన తర్వాత వెనెజులాలో ఎన్నికలని కుళ్లు జోకులు వేస్తున్నాడు. పక్క రాష్ట్రం మెక్సికోతో ఘర్షణ, చిన్నదీవి లాంటి దేశం క్యూబాపై మానవత్వం మరచి ఆంక్షలు పెట్టడంతో పాటు, ఇరాన్ యుద్ధం తర్వాత క్యూబా అంతు చూస్తానంటున్నాడు. మరోవైపు పక్క దేశం కెనడాను తమదేశంలో అంతర్భాగం రాష్ట్రంగా కలుపుకుంటామని అవాకులు చవాకులు పలుకుతున్నాడు. నాటోలో అంతర్భాగమైన డెన్మార్క్‌కు చెందిన గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించి నాటో కూటమి దేశాల్లో తమ పరపతి కోల్పోయాడు. ఆఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్ విమానాశ్రయం కావాలని పట్టుబడుతున్నాడు. ఇవన్నీ ట్రంప్ ఆయా దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించకుండా వేస్తున్న చిల్లర వేషాలు తప్ప మరొకటి కాదు. మరో ముఖ్యమైన విషయం. ఎప్‌స్టీన్ ఫైల్స్ నుండి బయటపడడం కోసం, అత్యంత పెద్దదైన ఆసియా ఖండంలో పట్టుకోసం మరో యుద్ధోన్మాద దేశం ఇజ్రాయిల్‌తో కలిసి కుట్రపన్నాడు! ఇరాన్‌ను ఓడిస్తే తనకు ప్రపంచంలో తిరుగుండదని, యుద్ధ ప్రారంభంలోనే ఖొమైనీ లాంటి ఆయువుపట్టును లేపేస్తే, తాను వెనెజులా దేశంలా ఇరాన్‌ను కబళించి ఆధిపత్యం చెలాయించాలని చేసిన ప్రయోగం బెడిసికొట్టింది. నలభై రోజులుగా యుద్ధంలో ఇరాన్ అటు ఇజ్రాయిల్‌తో పోరాడుతూనే, అమెరికా అవకాశ ఆధిపత్యాన్ని వ్యూహాన్ని సవాల్ చేసి నిలబడింది. ఇరానియన్ రిపబ్లిక్ గార్డుల ధైర్య సాహసాలముందు అమెరికా తలవంచక తప్పలేదు. అగ్రరాజ్య ఆధునిక యుద్ధ విమానాలను కూల్చివేయడంతో ట్రంప్ దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. అంతర్గత సంక్షోభం, అధికార మార్పిడి లాంటి మాటలు ఇరాన్‌లో తుత్తునీయలు కావడం, ప్రపంచ పాలక వర్గాలు ఎలావున్నా ప్రజలు మద్దతు ఇరాన్‌కు అను కూలంగా ఉండడం, ఇరాన్ కూడా భౌగోళిక యుద్ధ తంత్రం హార్మూజ్ జలసంధి మూసివేత, గల్ఫ్‌లో ఉన్న సౌదీ అరేబియా తదితర దేశాల్లో అమెరికా సైనిక శిబిరాలు, ఆయా దేశాల సాంకేతిక, ఆర్థిక వనరులపై వ్యూహాత్మకంగా దాడులు జరపడం ద్వారా అమెరికాకు వణుకు పుట్టించిందని చెప్పవచ్చు. ఇజ్రాయిల్ కోసం అమెరికా ఇరాన్‌పై దండయాత్రకు దిగింది. తమకు అమెరికా ప్రజలతో ఎలాంటి శత్రుత్వం లేదని ఇరాన్ ప్రకటించడం ఆ దేశ కుయుక్తిని ఎండగట్టింది. అమెరికా ఇరాన్ యుద్ధంలో ఒంటరై ఏకధృవ ప్రపంచం ఏవగింపునకు గురైంది. ఈ దశలో సీజ్‌ఫైర్ రెండు వారాల తర్వాత శాశ్వత ఒప్పందం జరుగుతుందా? యూటర్న్ తీసుకుంటుందా? ఈ విషయం నిర్ధారించే పరిస్థితి లేదు. ఎందుకంటే ఒప్పందం జరిగింది అమెరికా-ఇరాన్ మధ్య కనుక తాము యుద్ధం ఆపేది లేదని ఇజ్రాయిల్ తన యుద్ధ దాహం తీరక లెబనాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తోంది. అందుకు ప్రతిగా ఇరాన్ సైతం గల్ఫ్‌లో ఇజ్రాయిల్, అమెరికా అనుకూల దేశాలపై దాడులు చేస్తోంది. అమెరికా-ఇరాన్ యుద్ధం ద్వారా రష్యా ఒకింత ఆయిల్ వ్యాపార రిత్యా, ఉక్రెయిన్ వైపు అమెరికా ఆయుధ సంపత్తి అందకుండా చేయడంలో సఫలమైంది. చైనా, ఉత్తరకొరియా, రష్యా దేశాలు ఇరాన్‌కు అందించిన సాంకేతిక, ఆయుధ మద్దతు ఆ దేశం నిలబడడానికి చాలా తోడ్పాటునందించింది. హార్మూజ్ జలసంధి విషయంలో చైనా, రష్యా, ఫ్రాన్స్ ఐక్యరాజ్యసమితిలో తమ వీటో అధికారంతో ఇరాన్‌కు మద్దతు పలకడం అమెరికా ఏకఛత్రాధిపత్యానికి ఒక రకంగా చెక్ పెట్టినట్లే!


# సామాజిక న్యాయం ప్రపంచ శాంతికి వారధి



మానవ నాగరికత పరిణామ క్రమంలో పారిశ్రామిక విప్లవం ఒక మైలురాయి. అయితే, యంత్రాల హోరులో మనిషి శ్రమ దోపిడీకి గురవ్వడం, అమానవీయ పరిస్థితుల్లో కార్మికులు మగ్గిపోవడం ఆ విప్లవం తెచ్చిన మరో చీకటి కోణం. ఈ నేపథ్యంలో, "సామాజిక న్యాయం లేకుండా శాశ్వత ప్రపంచ శాంతి సాధ్యం కాదు" అనే గొప్ప ఆశయంతో ఉద్భవించిన అరుదైన వ్యవస్థ 'అంతర్జాతీయ కార్మిక సంస్థ'. ప్రపంచ చరిత్రలో కార్మిక హక్కుల పరిరక్షణకు ఒక దిక్సూచిలా నిలిచిన ఈ సంస్థ, గత శతాబ్ద కాలంగా శ్రామిక లోకానికి రక్షణ కవచంగా నిలుస్తోంది. 19వ శతాబ్దపు చివరలో, 20వ శతాబ్దపు ప్రారంభంలో ఐరోపా, అమెరికా ఖండాల్లో పారిశ్రామికీకరణ వేగంగా విస్తరించింది. కానీ, కార్మికులకు కనీస వేతనాలు లేవు, పని గంటలకు పరిమితి లేదు, ప్రాణాలకు రక్షణ లేని ప్రమాదకర వాతావరణం నెలకొంది. ఈ దోపిడీపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ దేశాలు శాంతి స్థాపన కోసం చర్చలు జరుపుతున్న తరుణంలో, కార్మిక సమస్యల పరిష్కారం కూడా ప్రపంచ శాంతిలో అంతర్భాగమేనని గుర్తించారు. ఈ క్రమంలోనే 1919లో జరిగిన 'వెర్సైల్లెస్ శాంతి ఒప్పందం' ద్వారా ఐ.ఎల్.ఓ ఆవిర్భవించింది. మొదట ఇది 'లీగ్ ఆఫ్ నేషన్స్'కు అనుబంధంగా పనిచేసినప్పటికీ, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1946లో ఐక్యరాజ్య సమితిలో చేరిన మొట్టమొదటి ప్రత్యేక అనుబంధ సంస్థగా గుర్తింపు పొందింది. దీని ప్రధాన కార్యాలయం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది. ఐ.ఎల్.ఓ యొక్క అత్యంత విశిష్టమైన లక్షణం దాని 'త్రైపాక్షిక నిర్మాణం'. ప్రపంచంలోని మరే ఇతర అంతర్జాతీయ సంస్థలోనూ ఇటువంటి ప్రజాస్వామ్య వ్యవస్థ కనిపించదు. ఇందులో ప్రభుత్వ ప్రతినిధులతో పాటు, యజమానుల సంఘాల ప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులు సమాన స్థాయిలో కూర్చుని నిర్ణయాలు తీసుకుంటారు. ఈ నిర్మాణం వల్ల ఏ చట్టం లేదా ప్రమాణం రూపొందించినా, అది క్షేత్రస్థాయిలో అమలు కావడానికి అవసరమైన సమతుల్యత దొరుకుతుంది. ఈ సంస్థ మూడు ప్రధాన విభాగాలుగా పనిచేస్తుంది. 'అంతర్జాతీయ కార్మిక సదస్సు' ఏటా ప్రమాణాలను నిర్ణయిస్తే, 'పాలక మండలి' కార్యనిర్వాహక బాధ్యతలు చేపడుతుంది. 'అంతర్జాతీయ కార్మిక కార్యాలయం' సచివాలయంగా సేవలందిస్తుంది. ఐ.ఎల్.ఓ లక్ష్యాల గురించి మాట్లాడుకుంటే, 1944లో ఆమోదించిన 'ఫిలడెల్ఫియా ప్రకటన' అత్యంత కీలకమైనది. "పేదరికం ఎక్కడున్నా అది ప్రపంచ సంపదకు ముప్పు" అని ఈ ప్రకటన ఘోషించింది. శ్రమ అనేది విక్రయ వస్తువు కాదని, భావప్రకటన స్వేచ్ఛ మరియు సంఘటితమయ్యే హక్కు పురోగతికి మూలమని ఇది చాటిచెప్పింది. ఈ స్ఫూర్తితోనే ఐ.ఎల్.ఓ ఇప్పటివరకు 190కి పైగా ఒప్పందాలను, 200కి పైగా సిఫార్సులను రూపొందించింది. వీటిలో ఎనిమిది ఒప్పందాలను 'కోర్ కన్వెన్షన్స్'గా పరిగణిస్తారు. బలవంతపు చాకిరీ నిర్మూలన, సంఘటిత హక్కు, సమాన వేతనం, వివక్ష రూపుమాపడం, మరియు బాల కార్మిక వ్యవస్థ అంతం చేయడం వంటివి ఇందులో భాగాలు. ముఖ్యంగా 1919లోనే 8 గంటల పని దినం, వారానికి 48 గంటల పని సమయాన్ని ప్రతిపాదించడం అప్పట్లో ఒక విప్లవాత్మక మార్పు. ప్రస్తుతం 187 సభ్యదేశాలతో విస్తరించిన ఈ సంస్థ, 1969లో తన 50వ వార్షికోత్సవం సందర్భంగా 'నోబెల్ శాంతి బహుమతి'ని గెలుచుకుంది. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం కాకుండా, మానవ గౌరవం కోసం చేస్తున్న కృషికి దక్కిన అంతర్జాతీయ గుర్తింపు. 1999లో జువాన్ సోమావియా డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సమయంలో 'డీసెంట్ వర్క్'(గౌరవప్రదమైన ఉపాధి) అనే సరికొత్త నినాదాన్ని ఐ.ఎల్.ఓ తెరపైకి తెచ్చింది. కేవలం పని దొరకడం ముఖ్యం కాదు, అది మనిషి ఆత్మగౌరవాన్ని కాపాడేలా, సామాజిక భద్రతతో కూడినదిగా ఉండాలని ఇది స్పష్టం చేస్తోంది. భారతదేశ దృక్పథంలో చూస్తే, మన దేశం ఐ.ఎల్.ఓ స్థాపక సభ్య దేశాలలో ఒకటి. మన రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, కార్మిక చట్టాలపై ఐ.ఎల్.ఓ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. 1923 నాటి కార్మికుల నష్టపరిహార చట్టం నుండి నేటి 'లేబర్ కోడ్స్' వరకు అన్నీ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగానే రూపుదిద్దు కున్నాయి. అయితే, గణాంకాలు నేటికీ సవాలు విసురుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 200 కోట్ల మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారని, వీరికి ఎటువంటి పెన్షన్ లేదా ఇన్సూరెన్స్ వంటి సామాజిక భద్రత లేదని ఐ.ఎల్.ఓ హెచ్చరిస్తోంది. అలాగే 16 కోట్ల మంది బాల కార్మికులు ఉండటం మానవాళికి మాయని మచ్చగా మిగిలింది. నేడు ప్రపంచం నాలుగో పారిశ్రామిక విప్లవంలో ఉంది. కృత్రిమ మేధ, రోబోటిక్స్ వంటి సాంకేతికతలు ఉద్యోగాల స్వరూపాన్ని మార్చేస్తున్నాయి. 'గిగ్ ఎకానమీ' పేరుతో కొత్త రకం ఉపాధి మార్గాలు వస్తున్నాయి. ఇక్కడ కార్మికులకు, యజమానులకు మధ్య స్పష్టమైన నిర్వచనం లేకపోవడం వల్ల హక్కుల పరిరక్షణ క్లిష్టంగా మారింది. వలస కార్మికుల సమస్యలు, వాతావరణ మార్పుల వల్ల ఉపాధి కోల్పోతున్న వారి పరిస్థితి ఐ.ఎల్.ఓ ముందున్న ప్రస్తుత సవాళ్లు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని 'ఫ్యూచర్ ఆఫ్ వర్క్' పేరుతో ఐ.ఎల్.ఓ కొత్త కార్యాచరణను సిద్ధం చేస్తోంది. డిజిటల్ యుగంలో కూడా మానవీయ విలువలు మరుగవ్వకుండా చూడటమే ఈ సంస్థ తదుపరి లక్ష్యం. గత వంద ఏళ్లలో ఐ.ఎల్.ఓ సాధించిన విజయాలు అపారం. బానిసత్వం లాంటి పని పరిస్థితుల నుండి కార్మికులను విముక్తి చేయడంలో, మహిళలకు ప్రసూతి సెలవుల వంటి హక్కులు కల్పించడంలో, కనీస వేతన చట్టాలను అమలు చేయడంలో ఈ సంస్థ పాత్ర చిరస్మరణీయం. అయినప్పటికీ, ఇంకా పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, నిరుద్యోగితా రేటును చూస్తే ఐ.ఎల్.ఓ ప్రయాణం ముగియలేదని అర్థమవుతుంది. ప్రతి మనిషికి గౌరవప్రదమైన పని, ప్రతి కార్మికుడికి సామాజిక న్యాయం దక్కిన రోజే ఐ.ఎల్.ఓ ఆశయం పరిపూర్ణమవుతుంది. శ్రామిక శక్తే ప్రపంచ సంపదకు మూలమని నమ్మి, ఆ శ్రమను గౌరవించే సమాజం కోసం ఈ అంతర్జాతీయ సంస్థ నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది.

# జన్యులోపమే పార్కిన్సన్‌కు మూలం

18వ శతాబ్దంలో జేమ్స్ పార్కిన్ సన్ అనే ఆంగ్లవైద్యుడు ఒళు ళ ఒణుకు వ్యాధి అనే పేరుతో మొదట దీన్ని నిర్వచించిన కారణంగా పార్కిన్సన్స్ వ్యాధి అంటారు. ఈ వ్యాధి వేదకాలంలోనే ప్రస్తావించబడింది. ఆయుర్వేద సంహితలో అంటే ప్రాచీన భారతీయ వైద్యశాస్త్రంలో ఈ వ్యాధి, దాని లక్షణాలు, చికిత్స పేర్కొన బడ్డాయి. నాటి వైద్యశాస్త్ర నిపుణులు దీన్ని కంపవాత మన్నారు. 2500 సంవత్సరాలకు పూర్వమే నైజింగ్ అనే చైనా వైద్యశాస్త్రంలో దీని గురించిన ప్రస్తావన వుంది. కంపవాతం ఆయుర్వేద రీత్యా ఒక నరాల జబ్బు. ఈ వ్యాధి సోకిన మనిషి కదలికలో వ్యత్యాసం కనిపిస్తుంది. కూర్చొని, పడుకొని ఉన్నంతసేపూ బాగుంటాడు. కాని లేచి నిలబడి కదలబోతే శరీరం వణికి ఇటూ అటూ కదిలిపోతూ పడిపోతుంటాడు. పార్కిన్సన్ వ్యాధిని ఇప్పటికీ కారణం తెలియని వ్యాధిగానే పరిగణిస్తు న్నారు. జన్యుపరంగా, పర్యావరణ కారణాలవల్ల ఈ వ్యాధి వస్తుంది. పర్యావరణ కాలుష్యం విషపదార్థాలు, ఎరువులు, డ్రగ్స్ (యాంటీ సైకోటికో, వాంతి వచ్చే మందులు) తయారీ, తరచుగా తలనొప్పి తదితర కారణాలతో పార్కిన్సన్ వ్యాధి ముడిపడి ఉంది. మెదడులో ఉత్పన్నమయ్యే డోపమైన్ కణాలు తగ్గిన పక్షంలో ఈ వ్యాధి వచ్చినట్టు నిర్ధారణ చేసుకోవచ్చు. ప్రొటీనోపతి (ప్రోటీన్లకు సంబంధించిన రుగ్మత) వల్ల పార్కిన్సన్ వ్యాధివచ్చే అవకాశముంది. పార్కిన్సన్ వ్యాధి సర్వసాధారణ వ్యాధి. ఇది సమాజంలో ప్రబలంగా ఉంది. 60 ఏళ్లు దాటిన వయోవృద్ధులకు ఇది వస్తుంది. దీన్ని వృద్ధాప్యంలో వచ్చే అంగవైకల్య వ్యాధిగా పరిగణిస్తారు. "వణుకుడు రోగం" లేక "పార్కిన్సన్స్ వ్యాధి" నాడీ కణాలను (నరాల కణాలను) దెబ్బ తీయడం ద్వారా ప్రగతిశీల మెదడు దెబ్బకు దారితీస్తుంది. 'డోపమైన్' అని పలవబడే న్యూరోట్రాన్స్మిటర్ ద్వారా మెదడు అంతటా సంకేతాలు ప్రసరించే బాధ్యత ఈ నాడీ కణాలదే. సాధారణ పరిస్థితులలో, మృదువైన, సమతుల్య కండరాల సమన్వయాన్ని డోపమైన్ సహాయంతో సాధించవచ్చు. ఈ డోపామైన్ అనే ఈ న్యూరోట్రాన్స్మిటర్ లేకపోవడం మూలంగానే "పార్కిన్సన్స్ వ్యాధి" లేక వణుకుడు రోగం మనుషుల్లో సంభవిస్తుంది. పార్కిన్సన్స్ వ్యాధి యొక్క ప్రారంభ




మరియు అత్యంత సాధారణ లక్షణాలు శరీరంలోని అవయవాల్లోని ఎదో ఒక భాగంలో... చేతులు లేదా కాళ్ళు లేదా దవడ లోనైనా, వణుకుడు రావడం. చేయి విశ్రాంతి దశలో ఉన్నప్పుడు ప్రకంపన లేదా వణుకు సాధారణంగా గుర్తించ బడుతుంది, సాధారణంగా చూపుడు వేలుకు వ్యతిరేకంగా బొటనవేలు యొక్క కదలికను చూడవచ్చు. దీని రెండవ లక్షణం సాధారణంగా కండరాల పెడసరం లేదా కండరాలు బిగదీయడం. మనిషి స్వేచ్ఛా చలన వలయాల్ని కుంటుపరుస్తూ (పరిమితం చేస్తూ) అనియంత్రితమైన కండరాల పెడసరం లేక కండరాలు పట్టేయడ మనేది వణుకుడు వ్యాధి లక్షణం. వ్యాధికి గురైన వ్యక్తులు చేపట్టిన ఏధైనా పనియొక్క వేగంలో క్రమమైన తగ్గుదలను చూపుతారు. స్నానం లేదా తినడం వంటి సాధారణ కార్యకలాపాల్ని పూర్తి చేయడంలో కూడా వీళ్ళు అసాధారణంగా ఎక్కువసేపు తీసుకోవాల్సి వస్తుంది.సాపేక్షంగా అరుదుగా ఉండే లక్షణాలలో భయము, చొంగ కార్చడం, చర్మ సమస్యలు, మూత్ర సమస్యలు, లైంగిక అసమర్థత ఉంటాయి. వ్యాధి బాధితుడి వణుకుడు గణనీయంగా సదరు వ్యక్తి మాటల్ని మరియు చేతివ్రాతను దెబ్బ తీస్తుంది. వణుకుడు రోగానికి సంభావ్య కారణాలను గుర్తించడానికి పరిశోధన కొనసాగుతున్నప్పటికీ, అదిప్పటికీ తెలియదు. జన్యు కారకాలు మరియు కొన్ని పర్యావరణ పరిస్థితుల్ని వణుకుడు జబ్బుకు ప్రమాద కారకాలుగా భావిస్తారు. పార్కిన్సన్స్ వ్యాధిని అభివృద్ధి చేయడంలో జన్యు పరివర్తనలు ప్రమాద కారకంగా గుర్తించబడ్డాయి, యాంటిసైకోటిక్ ఔషధాలను సేవించే వ్యక్తులు లేదా మెదడు అనారోగ్యంతో బాధపడుతున్న వారిలో లేదా గతంలో స్ట్రోక్ లకు గురై బాధపడుతున్న వ్యక్తులకు వణుకుడు రోగం సంభవించ వచ్చునని భావించ బడుతోంది. పరిస్థితిని నిర్ధారించడానికి నిర్దిష్ట రక్తం లేదా ప్రయోగశాల పరిశోధన లేనందున పార్కిన్సన్స్ వ్యాధి నిర్ధారణను గందరగోళంగా చెప్పవచ్చు. అంతే కాకుండా, లక్షణాలు తరచూ కీళ్ళ అసాధారణతలు లేదా విటమిన్ లోపాల వంటి ఇతర రుగ్మతలను అనుకరిస్తాయి. ఒక అర్హత కలిగిన న్యూరాలజిస్ట్ తో సలహా, సంప్రదింపులు తీసుకోవాలి. ఈ న్యూరాలజిస్ట్ కొంతకాలం పాటు లక్షణాలను పరిశీలించి, వ్యాధి పురోగతిని ఆపడమే లేక నియంత్రించడమో చేయగలరు. చికిత్సకు సంబంధించినంత వరకు, 'డోపమైన్' లోప పరిస్థితికి వివిధ రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఈ మందులు వ్యాధికి గురైన మెదడు బాగాలను ప్రేరేపించడం ద్వారా పని చేస్తాయి. అయితే, దీర్ఘకాలిక దశలో, ఈ మందులు దుష్ప్రభావాలను చూపుతాయి. మందులు వ్యాధి లక్షణాలను నియంత్రించ లేకుంటే, శస్త్రచికిత్స అవసరం కావచ్చు. మెదడును ప్రేరేపించటానికి ఎలక్ట్రోడ్లు ఉపయోగించడం ఇందులో జరుగుతుంది, ఇలా చేయడం ద్వారా వణుకుడ్ని ప్రేరేపించడానికి దారితీసే ప్రేరణల్ని అడ్డుకోవడం జరుగుతుంది. పార్కిన్సన్స్ వ్యాధి ఒక ప్రగతిశీల రుగ్మత. ఈ రుగ్మతకు ఖచ్చితమైన నివారణ లేదు. మానసిక ఆరోగ్యాన్ని, శారీరక చర్యల్ని చేపట్టే సామర్థ్యాన్ని కాపాడు కోవడమే ఈ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తుల దీర్ఘకాలిక లక్ష్యాలుగా ఉండాలి.

# అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలి

- పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణానికి అడుగులు వేద్దాం
- బ్లాక్ స్పాట్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రమాదాల నివారణకు కట్టుబడి ఉన్నాం
- అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ప్రతి ప్రాణాన్ని కాపాడటం మా లక్ష్యం.




**హనుమకొండ జిల్లా, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 13 నుండి 18 వరకు నిర్వహించనున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని అధికారులు సమష్టిగా విజయవంతం చేయాలని పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లో పోలీసు కమిషనర్ అధ్యక్షతన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ వరంగల్, జనగామ జిల్లాల కలెక్టర్లు చాహాత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద లతో కలిసి అదనపు కలెక్టర్లు, డీసీపీలు, ఏసీపీలు, ఆర్ డ బి, రవాణా తదితర శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు "అరైవ్ అలైవ్" కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. ఈ నెల 13 నుండి 18 వరకు కార్యక్రమాలను ప్రణాళిక బద్ధంగా ప్రతిరోజు సమర్ధంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీసు, రెవిన్యూ, రవాణా, ఆర్ డ బి శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలు తరచుగా జరిగే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి, తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హసన్‌పర్తి పరిధిలో ప్రమాదాలు అధికంగా ఉన్నందున జాతీయ రహదారులు, ఆర్ డ బి శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ప్రమాదంపై విచారణ జరిపి కారణాలను గుర్తించి నివారణ చర్యలు అమలు చేయాలని సూచించారు.
అదేవిధంగా రోడ్ల భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడం, వాహనదారుల్లో బాధ్యతాయుత డ్రైవింగ్ అలవాటు పెంపొందించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. పెట్రోల్ బంక్ యాజమాన్యాలతో సమావేశాలు, డ్రైవర్లకు కంటి పరీక్షలు ఇప్పటికే నిర్వహించామని, అవసరమైన వారు కంటి అద్దాలు తప్పనిసరిగా వినియోగించాలన్నారు. పోలీస్ మరియు సాంస్కృతిక కళాబృందాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచుతామని తెలిపారు. చివరి రోజున రూల్స్ పాటించిన వారికి ప్రశంస పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీఏ ఆధ్వర్యంలో పాఠశాల బస్సుల ఫిట్నెస్, డ్రైవర్ల అర్హతలు, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.తరచుగా ప్రమాదాలు జరుగుతున్న రహదారులపై ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై రోజువారీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా, మునిసిపల్, గ్రామ స్థాయిలో రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసి అవగాహన సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించేలా పర్యవేక్షణ చేయాలని, అధికారులు కూడా ఆదర్శంగా ఉండాలని సూచించారు. మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి, బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాల బస్సుల ఫిట్నెస్, డ్రైవర్ల అర్హతలపై దృష్టి పెట్టడంతో పాటు అవసరమైన కంటి అద్దాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సూచించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ బ్లాక్ స్పాట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుబడి ఉండాలని, 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా సురక్షిత సమాజ నిర్మాణానికి కలిసి ముందడుగు వేయాలని అన్నారు. వివిధ ప్రచార మాధ్యమాలు, కళాజాత కార్యక్రమాల ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించినప్పుడే ప్రమాదాలను తగ్గించగలమని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాల బస్సుల ఫిట్నెస్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మొత్తం బస్సులలో గణనీయమైన సంఖ్యలో ఫిట్నెస్ తనిఖీలు పూర్తిచేసి, డ్రైవర్లకు ఆరోగ్య, కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. మిగిలిన బస్సుల ఫిట్నెస్‌ను త్వరితగతిన పూర్తి చేసి, అన్ని వాహనాలు భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రతను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరై మాట్లాడుతూ, నేషనల్ హైవేపై ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక చర్యలు అవసరమని తెలిపారు. ప్రమాదాలున్న ప్రాంతాలను గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, ట్రాఫిక్ నియమాల అమలును కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిపిపి లు రాజమహేంద్ర నాయక్, దార కవిత, అంకిత్ కుమార్, ప్రభాకర్ రావు, అదనపు కలెక్టర్లు ఎన్. రవి, సంధ్యారాణి, వై వి గణేష్, ఆర్ అండ్ బి, రవాణా, రెవెన్యూ, విద్యుత్, ఆర్టీసీ, సంబంధిత శాఖల జిల్లాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శరీరం, మనసు, ఆత్మ సమతుల్యతకు యోగమే మార్గం

**వరంగల్ జిల్లా, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్)**
శరీరం, మనసు, ఆత్మ సమతుల్యతకు యోగమే మార్గమని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అన్నారు. ప్రజాపాలన-- ప్రగతి 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆరోగ్య థీమ్ -- 5వ రోజు సందర్భంగా శుక్రవారం "ప్రపంచ హోమియోపతి దినోత్సవం, ఆయుష్ దినోత్సవం" వేడుకలు ఖిలా వరంగల్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం స్వయంభూ దేవాలయం వద్ద నిర్వహించిన యోగ ప్రదర్శనలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్వయంగా యోగ ఆసనాలు చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగ సాధన ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు జీవనశైలి సంబంధిత వ్యాధులను నివారించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో యోగను భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ శామ్యూల్ హనుమాన్ (ఫాదర్ ఆఫ్ ఆయుష్) జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఖిలా వరంగల్‌లోని ముదిరాజ్ భవన్‌లో ఏర్పాటుచేసిన ఆయుష్ హెల్త్ క్యాంప్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆయుష్ వైద్యులు ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు.




ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉమా దామోదర్ యాదవ్, భోగి సువర్ణ, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సాంబశివరావు, జిల్లా ఇన్‌చార్జ్ ఎం. రాజు, డీపీఎం రాజు, నేచురోపతి మెడికల్ ఆఫీసర్ డా. అమృత వల్లి, ఆయుష్ వైద్యులు డా. రాజేందర్, డా. రాము, డా. శ్రీలత, అధికారులు, ప్రజాప్రతినిధులు, నర్సులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం కేసు నిందితుడు అరెస్ట్

**మొగుళ్ళపల్లి, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):**
జిల్లాలో నేరాల నియంత్రణలో భాగంగా మొగుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సి.ఐ మల్లేష్ యాదవ్ పర్యవేక్షణలో, ఎస్.ఐ ముప్పు సురేష్ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల సమయంలో నిందితుడు మిర్యాల భాస్కర్ (30 సం.లు, వడ్డెర, కూలి, నివాసం: పలివేల్పుల భీమారం)ను 09-04-2026 ఉదయం సుమారు 9:30 గంటలకు మొగుళ్ళపల్లి పెద్ద వాగు బ్రిడ్జ్ వద్ద అనుమానాస్పదంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో, నిందితుడు 29-03-2026న మొగుళ్ళపల్లి మండలం ఇప్పలపల్లి గ్రామంలో గ్యాస్ స్టవ్ రిపేర్ పేరుతో ఇంటిలోకి ప్రవేశించి రూ.15,000/- నగదు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. అదేవిధంగా వరంగల్, కరీంనగర్, భూపాలపల్లి జిల్లాల్లో ఇదే తరహాలో పలుమార్లు దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించాడు. నిందితుడి వద్ద నుండి మొత్తం రూ.48,820/- నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.15,000/- ఇప్పలపల్లి గ్రామ దొంగతనానికి సంబంధించినది కాగా, మిగిలిన మొత్తం ఇతర ప్రాంతాల్లో జరిగిన దొంగతనాలకు చెందినదిగా గుర్తించారు. అదనంగా ఒక బైక్, బంగారం మరియు వెండి ఆభరణాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన నగదు, ఆభరణాలను సీజ్ చేసి, నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

**ప్రజలకు విజ్ఞప్తి:**
అపరిచిత వ్యక్తులను ఇంటిలోకి అనుమతించే ముందు వారి వివరాలు తప్పనిసరిగా ధృవీకరించుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.



## యూపీఎస్సీ ద్వారా నిర్వహించే పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**హనుమకొండ జిల్లా, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):**
యూపీఎస్సీ నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్డీఏ), నావల్ అకాడమీ మరియు కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. ఈనెల 12న నిర్వహించనున్న పరీక్షల సందర్భంగా కేంద్రాల వద్ద భద్రత, నిరంతర విద్యుత్, వైద్య సదుపాయాలు, ప్రశ్నాపత్రాల రవాణా తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులు నడపాలని తెలిపారు. జిల్లాలో యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రెండు, పింగిలి ప్రభుత్వ బాలికల కళాశాలలో ఒక పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయగా, మొత్తం 963 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ పరీక్ష మొదటి పేపర్ ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. అదేవిధంగా కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ ఎగ్జామినేషన్--1లో మొదటి పేపర్ ఉదయం 9.00 గంటల నుంచి 11.00 గంటల వరకు, రెండో పేపర్ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2.30 గంటల వరకు, మూడో పేపర్ సాయంత్రం 4.00 గంటల నుంచి 6.00 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ అప్పయ్య, బీసీ సంక్షేమ అధికారి నరసింహమూర్తి, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, పింగిలి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి, పోస్టల్, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భద్రకాళి చెరువు పూడికతీత పనుల్లో మరింత వేగం పెంచాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్**



**హనుమకొండ జిల్లా, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):**
భద్రకాళి చెరువు పూడికతీత పనులను మరింత వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం భద్రకాళి చెరువులో కొనసాగుతున్న పూడికతీత పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కాజీపేట మండలం అమ్మవారిపేటలోని ప్రభుత్వ స్థలాలలో డంపింగ్ చేస్తున్న పూడిక మట్టిని సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువులో జరుగుతున్న పూడికతీత పనుల పురోగతిని తెలుసుకుని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. భద్రకాళి చెరువులో తీస్తున్న పూడిక మట్టిని ప్రభుత్వ భూముల్లో క్రమపద్ధతిలో నిల్వ చేయాలని, భూముల పరిరక్షణకు ఇది ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పూడికతీత పనులను మే 15 నాటికి పూర్తిచేసే విధంగా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అమ్మవారిపేటతో పాటు ఇతర ప్రాంతాలలో పూడిక మట్టిని నిల్వ చేస్తున్న ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. మొత్తం 7.70 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను ఇప్పటివరకు సుమారు 2 లక్షల క్యూబిక్ మీటర్ల పూడికతీత పూర్తయిందని, మిగిలిన పనులను వేగవంతం చేసి లక్ష్యాన్ని సమయానికి చేరుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాగునీటి పారుదల శాఖ ఈఈ కిరణ్ కుమార్, డిఈ మధుసూదన్ రెడ్డి, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఏఈ శ్యామ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## టేకుమట్ల పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):**





జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ వార్షిక తనిఖీల్లో భాగంగా టేకుమట్ల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందడం ఈ తనిఖీ యొక్క ముఖ్య ఉద్దేశంగా తెలిపారు. ఈ సందర్భంగా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్క నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం స్టేషన్ ప్రాంగణ పరిశుభ్రత, పరిసరాల నిర్వహణ, రికార్డుల నిర్వహణ విధానం, సిబ్బంది విధి నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. అలాగే స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- ఇప్ప పువ్వు, తేనె సేకరణతో మహిళా సంఘాలకు మెరుగైన ఉపాధి
- అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ
- రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)



**తాడ్వాయి, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):**
పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని,ఇప్ప పువ్వు , తేనె సేకరణతో మహిళా సంఘాలకు మెరుగైన ఉపాధి లభిస్తుందని, అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందుతుందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా సమ్మక్క సారలమ్మ తాడ్వాయి మండలం గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్నారం గ్రామంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 15 లక్షల రూపాయల సి ఆర్ ఆర్ నిధుల తో చేపట్టనున్న అంతర్గత సి.సి. రోడ్ల నిర్మాణ పనులకు, అంకంపల్లి గ్రామంలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఐటిడిఏ నిధులు సుమారు 83 లక్షలతో ఆర్ అండ్ బి రోడ్డు నుండి అంకంపల్లి వరకు బిటి రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర మంత్రి వర్యులు ధనసరి అనసూయ సీతక్క శంకుస్థాపన చేశారు. అదే గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు. పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్టాలను పంపిణీ చేశారు. స్థానిక అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి మౌలిక సదుపాయాల కల్పన పలు అంశాలపై అంగన్వాడి చిన్నారులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని మారుమూల ప్రాంతాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. అంకంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్ట్ ద్వారా అన్ని మౌలిక వస్తువులు కల్పిస్తూ మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని, గతంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రజలకు రవాణా సౌకర్యాలను కల్పించడం కోసం ఆర్ అండ్ బి రోడ్డు నుంచి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని అత్యంత నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. గూడు లేని ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవతో ములుగు నియోజకవర్గానికి 5000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని త్వరలోనే అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం రెండో విడతను ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా స్థానిక ఉత్పత్తులైన ఇప్ప పువ్వు తేనె సేకరణ వంటి పనులను చేపట్టడం ద్వారా మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని పేర్కొన్నారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని, మెనూలో ఎటువంటి లోపాలు చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం

**జీవన శైలిలో యోగ ఒక భాగంగా అలవర్చుకోవాలి : రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)**

**ములుగు జిల్లా, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):**
యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, రోజువారి జీవనశైలిలో యోగ ప్రక్రియను ఒక భాగంగా దినచర్య అలవర్చుకోవాలని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా బండారుపల్లి గిరిజన భవన్ లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక హెల్త్ వీక్ లో భాగంగా హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హానిమాన్ 271వ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ హోమియోపతి (ఆయుష్ డే) దినోత్సవ యోగ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ యోగా చేయడం ద్వారానే సంపూర్ణమైన ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రజల దినచర్యలో యోగా ఒక భాగంగా అలవర్చుకోవాలని ఉదయం 30 నిమిషాల నుంచి 60 నిమిషాల వరకు యోగ చేయడం ద్వారా శరీరం మెదడు చురుకుగా పనిచేస్తాయని తెలిపారు. పురాతన కాలం నుంచి యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. సంపూర్ణమైన ఆరోగ్యం ద్వారా మాత్రమే మనిషి తన ఆశలను ఆశయాలను ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా యోగ దినచర్యగా అవలంబించుకోవడం ద్వారా శరీరానికి మనసుకి ఉపశమనాన్నిస్తుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ కనీసం 45–50 నిమిషాల యోగా, వ్యాయామం చేయాలని సూచించారు. దీనివల్ల రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చని తెలిపారు. వ్యాయామంతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. మంత్రి, కలెక్టర్, అధికారులు ఆయుష్ సిబ్బంది, క్రీడాకారులు, క్రీడాభిమానులతో కలిసియోగాసనాలు వేసి అందర్నీ ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ గోపాలరావు, కౌన్సిలర్లు, మెడికల్ కళాశాల విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ కార్మికులపై కక్షసాధింపు చర్యలు దుర్మార్గం

**23 వేల మందిని తొలగిస్తామనడం సబబు కాదు**

**చర్చలకు పిలవాల్సింది పోయి బెదిరిస్తారా..?**

**ప్రభుత్వం తీరుపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే గండ్ర**

**భూపాలపల్లి, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):**
గత మూడు రోజులుగా సమ్మె చేస్తున్న విద్యుత్ కార్మికులను విధుల నుండి తొలగిస్తాం, వారిని భర్తరఫ్ చేస్తామని కార్మికులను భయందోళనకు గురిచేస్తూ ఆ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరియు విద్యుత్ శాఖ చైర్మన్ అండ్ డైరెక్టర్ల వ్యవహారశైలిని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి తప్పు పట్టారు. హైదరాబాద్లోని తెలంగాణ భవన్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ గత మూడు రోజులుగా విద్యుత్ శాఖ లో వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులు తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకొొచ్చి, వాళ్ళకి న్యాయం జరగకపోవడంతో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. కార్మికులను పిలిచి మాట్లాడాల్సిన ప్రభుత్వం వారిపై కక్ష్య సాధింపు చర్యలు చేయడం చాలా దుర్మార్గం. ఆర్టిజన్స్ గా విధులు నిర్వహిస్తూ విద్యార్హతను బట్టి గ్రేడింగ్ పద్ధతిలో సరియైన ఉద్యోగ ప్రమోషన్ ఇవ్వాలని కోరితే కార్మికులను చర్చలకి పిలిచి మాట్లాడాల్సింది పోయి 23,000 మంది కార్మికులను డిస్మిస్ చేస్తా, భర్తరఫ్ చేస్తాం అనడం సబబు కాదు. విద్యుత్ ప్లాంట్లలో పనిచేసే కార్మికులు 45 నుండి 50 డిగ్రీస్ టెంపరేచర్ విపరీతమైనటువంటి వేడిని తట్టుకొని అక్కడ ఉద్యోగాలు చేస్తా ఉంటే, వారితో పాటు విద్యుత్ ట్రాన్స్ కార్మికులు కూడా ఎక్కడ సమస్య వచ్చిన కొన్ని నిమిషాలల్లో సమస్య ని పరిష్కరిస్తున్నారు కాబట్టే మనం ఇక్కడ సంతోషకరమైన జీవితాన్ని గడుపుతున్నాం. నా భూపాలపల్లి నియోజకవర్గంలో కూడా దాదాపు 700 నుండి 800 మంది కార్మికులు సమ్మె చేసేందుకు ఒక్క టెంట్ వేసుకుంటామంటే కూడా అనుమతి నిరాకరించడం సిగ్గు చేటు. అయిన వారి యొక్క న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 40డిగ్రీలా ఎండలో సమ్మె చేస్తున్నారు. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రలో ఉద్యోగుల జీతాలు రూ. 6000/– ఉంటే కేసీఆర్ వారి జీతాలను రూ. 40000/– వరకు పెంచి, వారికీ అందాల్సిన అన్ని పథకాలను అమలు చేయడం జరిగింది. ఆ రోజు ఎన్నికల సమయంలో కపట ప్రేమ కురిపించి కేసీఆర్ ప్రభుత్వం కంటే గొప్పగా చేస్తామని చెప్పి కార్మికులను రోడ్డు పాలు చేయడం సరికాదు. ఇదే కాకుండా ఆర్టిజన్ కార్మికులకు ఆరోగ్య భద్రత తీసివేస్తామని బెదిరించడం ఎంత వరకు న్యాయం. ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని, ఆ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క వెంటనే కార్మికులను చర్చకు పిలిచి వారి డిమాండ్లను పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరుతూ,ప్రభుత్వం ఇలానే మీనామేషాలు లెక్కపెడితే కార్మికుల పక్షాన, వారికీ అండగా బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.




## గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చిన నాయకుల అరెస్టు హేయమైన చర్య

**మెపా వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్**



**హనుమకొండ, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):**
ముదిరాజ్ లను బిసి డి నుండి బీసీ ఏ లోకి మారుస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ హామీని అమలు చేయకపోవడంతో శుక్రవారం నాడు ముదిరాజ్ చైతన్య వేదిక ఆధ్వర్యంలో హలో ముదిరాజ్ చలో గాంధీ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని ముదిరాజ్ నాయకులు డా.వై. శివ ముదిరాజ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా శివతోపాటు గాంధీభవన్ ముట్టడిలో పాల్గొన్న ముదిరాజ్ నాయకులను విద్యార్థులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం హేయమైన చర్యని ఈ అరెస్టులను మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ) వ్యవస్థాపన రాష్ట్ర కమిటీ ఈ చర్యను ఖండిస్తుందని మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. ముదిరాజులకు లబ్ధి చేకూరే ఏ కార్యక్రమమైనా, ఏ ముదిరాజ్ సంఘం చేపట్టిన వారికి "మెపా" తెలంగాణ రాష్ట్ర కమిటీ, అన్ని జిల్లా కమిటీలు ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తాయని అన్నారు.

## సర్పంచులు అంకితభావంతో పనిచేయాలి

**గ్రామాల్లో వసతులు మెరుగుపరచడం లక్ష్యంగా ఉండాలి**

**సర్పంచ్ లతో సమావేశాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే రేవూరి**



**పరకాల, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):**
శుక్రవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల, నడికుడ, దామెర, ఆత్మకూరు మండలాల పరిధిలోని సర్పంచ్ లు మరియు అధికారులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం నూతన సర్పంచులు అంకితభావంతో పనిచేయాలి అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రజలతో సమన్వయం చేసుకుంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలి అని,ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరేలా సమర్థంగా అమలు చేయాలి అన్నారు. అలాగే ఎండాకాలంలో నీటి ఎద్దడి నివారణకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి అని,మిషన్ భగీరథ నీటి సరఫరా, బోరు బావుల మరమ్మ తులు, పైప్‌లైన్ లీకేజీల అరికట్టడం, తదితర చర్యలు చేపట్టాలని అన్నారు.

## ఇండోర్ స్టేడియం పనులను పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్)**
ఇండోర్ స్టేడియం పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాటారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇండోర్ స్టేడియం పనులు నత్త నడకన సాగడం పై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటవెంటనే మంజూరు చేస్తామని తెలిపారు. గుత్తే దారు పనులను వేగవంతం చేయకపోతే నోటీస్ ఇచ్చి అతనిని తప్పించి నూతన గుత్తే దారుకు అప్పగించాలని సూచించారు. వానకాలం లోపు పనులు పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం కాటారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్ షెల్టర్ స్థలాన్ని పరిశీలించి తహసీల్దార్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజా ప్రతినిధులు కోరగా ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించి ఆదేశాలిస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రఘు, తహసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో గురుకుల విద్యార్థినుల జోరు

**రజత పతకాలు సాధించిన లక్ష్మీప్రసన్న, హర్షిత**

**యువ బాక్సర్లకు అభినందనల వెల్లువ**

**కోచ్ రమేష్ మరియు ప్రిన్సిపాల్ హర్షం**



**ములుగు, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):**
రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో ములుగు జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులం కళాశాలకు చెందిన విద్యార్థినులు బండ లక్ష్మీప్రసన్న, సులుగురి హర్షితలు రజత పతకాలు సాధించినట్లు కోచ్ మామిడిపెల్లి రమేష్ తెలిపారు, జనవరి నెల 27 నుండి 29 వరకు సికింద్రాబాద్ సౌత్ లాలాగూడ బాక్సింగ్ హాల్ లో జరిగిన (గ+ఫీ×) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో 19సం.రాల విభాగంలో 63కేజీలలో లక్ష్మీప్రసన్న, 91కేజీలలో హర్షితలు అత్యంత ప్రతిభకనబర్చి (సిల్వర్) రజత పతకాలు సాధించినట్లు కోచ్ రమేష్ తెలిపారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ నర్మదా భాయ్, పిఈటిలు శ్రీలత, సమత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు అభినందించారు

# పాఠశాల టెండర్లలో కాంగ్రెస్ 2వేల కోట్ల కుంభకోణం

## బడా కాంట్రాక్టర్లకు మేలు కోసమే ఈఎండి, ఎస్.డి పెంపు

## జీవో నెం 17 వల్ల పేద కాంట్రాక్టర్లకు అన్యాయం

## అంబేద్కర్ జయంతి నాడు బహిరంగ క్షమాపణ చెప్పాలి

## సిఎం రేవంత్ రెడ్డికి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బహిరంగ లేఖ

## డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బిఆర్ఎస్




**హైదరాబాద్, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):**
కాంగ్రెస్ పాలనలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కంపెనీలకు అన్యాయం. కాంగ్రెస్ సామాజిక న్యాయానికి తూట్లు పొడిచింది. కేసిఆర్ పాలనలో 2014 నుండి 2023 వరకు విదర్యాంగంలో, పారిశ్రామిక రంగంలో సామాజిక న్యాయం అద్భుతంగా నాలుగు పాదాల మీద నడిచింది. కోడిగుడ్లు, కూరగాయలు, ప్లేట్లు, దుప్పట్లు పంపిణీ చేయడానికి సూక్ష్మ చిన్న మధ్య తరహా కాంట్రాక్టర్లను తయారు చేశారు. కేసిఆర్ హయాంలో 10 నుండి 20 వేల మంది ఎస్సీ ఎస్టీ బిసి వర్గాల కాంట్రాక్టర్లు తయారయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్, కామారెడ్డి డిక్లరేషన్ లలో బిసిలకు 42 శాతం, ఎస్సీలకు 18 శాతం ,ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, ప్రైవేట్ సంస్థలు, ప్రభుత్వ సహకారం పొందిన ప్రైవేట్ కంపెనీల్లో కూడా రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ వచ్చి 3 ఏండ్లు గడిచాయి. కానీ ఎస్సీ ఎస్టీ బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వడం లేదు. గతంలో కేసిఆర్ చిన్న,సూక్ష్మ పరిశ్రమల రంగం అభివృద్ధి చెందాలి,వలసలు ఆగాలని ప్రోత్సాహకాలిస్తూ పేద వర్గాల యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని అవకాశాలు కల్పించారు. కానీ ఈ రోజు కాంగ్రెస్ పూర్తిగా ఎంఎస్ఎంఈ లను నాశనం చేసింది. జీవో 17 ను గతంలో హై కోర్టు మార్పులు చూయాలని సూచించింది.అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా టెండర్లకు ఆహ్వానం పలుకుతూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ట్రంక్ బాక్స్, ప్లేట్లు, గ్లాసులు, యూనిఫాంలు, నోట్ బుక్స్ వంటి వస్తువుల సరఫరాకు దేశ వ్యాప్తంగా టెండర్లకు ఆహ్వానం పలికింది. గతంలో కేసిఆర్ హయాంలో విద్యార్థులకు యూనిఫాం, దుప్పట్లు, పిఈటి డ్రెస్ లు సిరిసిల్ల నేతన్నలు, చిన్న చిన్న పరిశ్రమల వాడల నుండి జిల్లాల్లో ఉండే సెజ్ ల నుండి సరఫరా అయ్యేది. కాంగ్రెస్ ప్రభుత్వం 2వేల కోట్ల భారీ కుంభకోణానికి తెర లేపి,ఎఐసిసి కి ఏటిఎం గా పనిచేసే కంపెనీలకు కాంట్రాక్టులు అప్పజెప్పాలనే కుట్ర. గతంలో జిల్లా వ్యాప్తంగా టెండర్లు పిలిచి కాంట్రాక్టులు ఇచ్చేవారు.. కానీ ఇపుడు దేశవ్యాప్తంగా టెండర్ నోటిఫికేషన్ ఇచ్చి సెంట్రలైజ్డ్ చేశారు.నేషనల్ కాంపిటేటివ్ బిడ్డింగ్ అన్నారు. ట్రంక్ బాక్సు సరఫరా టెండర్ లో పాల్గొనాలంటే బ్యాంక్ నుండి 10 కోట్లు సాల్వెన్సీ చూపించాలి. అలాగే 10 కోట్ల టర్నోవర్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. టై, బెల్ట్,స్కూల్ బ్యాగ్ సరఫరా టెండర్ దక్కాలంటే బ్యాంకు నుండి 50 కోట్ల సాల్వెన్సీ కలిగి ఉండాలి మరియు 20 కోట్ల టర్నోవర్ కలిగి ఉండాలి. ఇంక నోట్ బుక్స్ సరఫరా లో అయితే భారీ కుట్ర దాగి ఉంది. రేవంత్ ప్రభుత్వం నోట్ బుక్ పేపర్ లో కూడా వాటర్ మార్క్ ఉండాలంటున్నారు. వాటర్ మార్క్ అనేది కరెన్సీ నోట్లకు,స్టాంప్ పేపర్లకు వాడే పేపర్? అలాంటి పేపర్ నోట్ బుక్స్ కు ఎందుకు? పైగా దీనికి బ్యాంక్ నుండి 40 కోట్ల సాల్వెన్సీ కలిగి ఉండాలి,?టర్నోవర్ 150 కోట్లు ఉండాలి. షూస్ కాంట్రాక్టుకోసం 20 కోట్ల టర్నోవర్ కలిగి ఉండాలి. ఇవన్నీ పేద కాంట్రాక్టర్లకు ఉంటాయా? చర్లపల్లి, పాశమైలారం వంటి పారిశ్రామిక ఉండే వాడల్లో ఉంటే చిన్న మధ్య తరహా కంపెనీలు కలిగి ఉంటాయా? వీరికి బ్యాంకులు కోట్ల విలువైన సాల్వెన్సీ ఇస్తాయా? అంటే ఇవన్నీ నిబంధనలు పేదలను, చిన్న మధ్యతరహా కంపెనీలను కాంట్రాక్టర్లకు దూరం చేయడమే. కేవలం కొంత మంది బడా కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చడమే. జీవో నెం 17 హై కోర్టు మాడిఫై చేయాలని చెప్పినా వినడం లేదు. వారి అనుచరులకు, వారికి సంబంధించిన కంపెనీలకు కట్టబెట్టే కుట్ర. పైగా టెండర్ దక్కిన వారు కేవలం 45 రోజుల్లోనే వస్తువులు సప్లయ్ చేయాలని చెబుతున్నారు ఇదెలా సాధ్యం కేసిఆర్ ఉన్నపుడు అనవసర,కఠిన నిబంధనలు ఏమీ లేకుండా, పేదలను,చిన్న మధ్యతరహా కంపెనీలకు కాంట్రాక్టులు దక్కేలా చూశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్ వేయాలంటే ప్రీ బిడ్ మీటింగ్ కు అటెండ్ కావాలంటే ఎవరైనా సరే, 50 వేలు, 25 వేల డిడి తీయాలని ఎంట్రీ ఫీజు పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమైనా సినిమా నడిపిస్తుందా? లేదా సర్కస్ నడిపిస్తుందా? ఎంట్రీ ఫీజులు పెటాటడం ఏంటి? విద్యాశాఖ మంత్రిగా మీ శాఖ నుండే ఈ నోటిఫికేషన్ వచ్చింది. అంటే ఖచ్చితంగా రేవంత్ రెడ్డి,వారు ఎన్నికల సమయంలో ఇచ్చిన చేవెళ్ల,కామారెడ్డి డిక్లరేషన్ హామీలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని అర్థం అవుతుంది. కేసిఆర్ హయాంలో మేము గతంలో జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాము. ఎస్సీ ఎస్టీ బిసిలకు అవకాశాలు ఇవ్వాలని, రిజర్వేషన్లు తప్పక అమలు చేయాలని,రాజ్యాంగ బద్దంగా లభించిన హక్కులు అమలుచేయాలని కోరాం. కానీ కాంగ్రెస్ ఇపుడు ఆ పని చేయడం లేదు. కనీసం ఎస్సీ, గిరిజన, బిసి, మైనారిటీ కో ఆపరేటివ్ కార్పొరేషన్ లకు కూడా అవకాశం ఇవ్వడం లేదు. ఇది ఖచ్చితంగా బడా కాంట్రాక్టర్ల జేబులు నింపడమే.
ఎఐసిసి ఏటిఎం గా పనిచేసే వారికి లాభం చేసే కుట్ర. మరి 10 వేల మంది కాంట్రాక్టర్లు అడ్డాకూలీలుగా, బానిసలుగా ,బిక్షం ఎత్తకునే వారుగా మారాలా? ఢిల్లీ కి మూటలు పంపడం కోసమే జీవో 17 తెచ్చారు. పి ఎం యూ రద్దు చేయాలి. అప్పుడే పేదలకు న్యాయం. జీవో 17 రద్దు చేయాలి. చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ఎస్సీ ఎస్టీ బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలి. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్రలో ఉన్న కంపెనీలకే కాంట్రాక్టులుగా అవకాశం ఇస్తుంది. కానీ తెలంగాణలో కాంగ్రెస్ కు తెలంగాణ కంపెనీలు, తెలంగాణ కాంట్రాక్టర్లకే ఇస్తామని ఎందుకు చెప్పడం లేదు?
ఎందుకంటే తెలంగాణ కాంగ్రెస్ కు తెలంగాణ ప్రజల ప్రయోజనాల కంటే, ఢిల్లీ ఎఐసిసి ప్రయోజనాలే ముఖ్యం. కర్ణాటకలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్లం ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు ఇస్తుంది. తెలంగాణలో ఎందుకు ఇవ్వరు. మొన్న రేవంత్ రెడ్డి కేరళకు వెళ్లి సామాజిక న్యాయం గురించి మాట్లాడారు. ఏది ఇక్కడ సామాజిక న్యాయం? పేద వర్గాలకు కాంట్రాక్టులు దూరం చేయాలనే కుట్రతో జీవో నెం 17 లో పొపందురిచిన ఈఎండి, సెక్యూరిటీ డిపాజిట్ లను రద్దు చేయాలి. ఏప్రిల్ 14 న అంబేద్కర్ జన్మదినం సందర్భంగా, ఆరోజు అంబేద్కర్ విగ్రహానికి దండ వేసే ముందే జీవో 17 రద్దు చేయాలి. మూడేండ్లుగా పేద కాంట్రాక్టర్లను మానసికంగా హింసించినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. ఈ అంశాలపై ముఖ్యమంత్రి కి బహిరంగ లేఖ రాస్తున్నా. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ నాయకులను ఏప్రిల్ 14న జీవో నెం 17 పేరిట 2 కోట్ల కుంభకోణాన్ని ప్రశ్నిస్తాం.. నిలదీస్తాం.. అని అన్నారు.

# ఆడ పిల్లలను జన్మనిస్తుందనే సాకుతో భార్య ఇద్దరు పిల్లలను హత్య

**వరంగల్ :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలంగా మారిన భార్య ఇద్దరు బాలికల హత్యకు సంబంధించి కేసులో హత్య గురైన మృతురాలి భర్తతో పాటు ఈ హత్యలకు పరోక్షంగా కారణంగా నిలిచిన మరో తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో వున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ప్రధాన నిందితుడు వరంగల్ జిల్లా, పున్నెలు గ్రామానికి చెందిన యం.డి అజారుద్దీన్ (29)తో పాటు, నిందితుడి కుటుంబ సభ్యులు పున్నెలు గ్రామానికి చెందిన యం.డి చాంద్పాషా (49), యం.డి సలీహా (45), యం.షరోద్దీన్ (25)లతో పాటు బసిక స్రవంతి (32), కడిపికొండ, బాల్నె పార్థు (47) నెక్కొండ, బొమ్మెర మనోహర్(39), గీసుగొండ, లింగాల నరేష్(37), కొండపర్తి, సాట్లరాజు (32), పున్నెలు, వాకుదోట్ భద్రు (60), ఎనుగల్లు చెందిన వారిని పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు డా. బాల్నె పూర్ణిమ, డా. ఎస్.రవళీ పరారీలో వున్నారు. ఐనవోలు మండలం పున్నెలు గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు అజారుద్దీన్ ఇదే గ్రామానికి చెందిన మృతురాలు ఫరహాత్తు 2016 సంవత్సరంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు హుమేరా (09), ఆయేషా (06) వున్నారు. తరువాత మృతురాలు గర్భం దాల్చడంతో తిరిగి అడ పిల్లకు జన్మనిస్తుందనే రెండు దఫాలు నిందితుడు మృతురాలికి అబార్షన్ చేయించడం జరిగింది.



ఇదే సమయంలో నిందితుడి దూరపు బంధువైన మైనర్ బాలికపై ప్రేమ పెంచుకున్న నిందితుడు పెళ్ళి చేసుకుంటానని మైనర్ బాలికకు నిందితుడు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసాడు.నీకు ఇంతకు ముందే పెళ్ళి అయి ఇద్దరు పిల్లలు వున్నారు. నేను నిన్న పెళ్ళి చేసుకోనని మైనర్ బాలిక నిరాకరించడంతో, తనకు భార్య పిల్లలు వుండటం కారణంగానే మైనర్ బాలిక పెళ్ళి అంగీకరించడం లేదని భార్య పిల్లలపై కక్ష్య పెంచుకున్నాడు తను ప్రస్తుతం ప్రేమిస్తున్న బాలికను పెళ్ళి చేసుకోవాలంటే భార్య, పిల్లలు బ్రతికుండగా సాధ్యం కాదని, వారిని చంపడం ద్వారా ఇది సాధ్యమని నిర్ణయించుకున్నాడు నిందితుడు. ఇందుకోసం నిందితుడు తాను అనుకున్న ప్రణాళిక ప్రకారం ఈ నెల 1వ తారీఖు రాత్రి సుమారు 7.50 గంటలకు ఐసు క్రీం తినిపిస్తానని భార్య పిల్లలను తాను నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్ వద్దకు కారులో తీసుకరావడం జరిగింది. ప్రణాళిక ప్రకారం నిందితుడు ముందుగానే స్విమ్మింగ్ పూల్ వద్ద సిసి కెమెరాలు, కరెంటు నిలిపి వేయడంతో స్విమ్మింగ్ చేరుకున్న మృతులను నిందితుడు బలవంతంగా స్విమ్మింగ్లోకి నెట్టివేసి స్విమ్మింగ్ పూల్లో పడిపోయిన భార్య పిల్లలను బలవంతంగా వారు చనిపోయేవరకు వారిని నీటిలో ముంచి దారుణంగా హత్య చేసాడు.

ఈ ముగ్గురిని హత్య చేసిన అనంతరం నిందితుడు వీరు మరణించినట్లుగా నిర్థారించుకొని తన భార్య పిల్లలు స్విమ్మింగ్ పూల్లో పడి మృతి చేందారని ప్రచారం చేశాడు. మృతిరాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు తమకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకొని నిందితుడు అజారుద్దీన్ తన భార్య పిల్లలను దారుణంగా హత్య చేసినట్లుగా నిర్థారణకు వచ్చారు. పట్టుబడిన నిందితుల్లో స్రవంతి పై మూడు కేసులు, డా. పార్థు మీద నాలుగు కేసులు, ప్రస్తుతం పరారీ లో వున్న డా. పూర్ణిమ పై నాలుగు కేసులు ఉన్నట్లుగా పోలీసులు వెల్లడించారు.

# హైదరాబాద్‌లో 75 శాతం రౌడీషీటర్లకు డ్రగ్స్ పాజిటివ్



**హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో రెగ్యూలర్ గా హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు తనిఖీలు జరుగుతున్నాయి. హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా పోలీసులు ఒక భారీ ఆపరేషన్ చేపట్టారు. సిటీ వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు, వారిలో డ్రగ్స్ అలవాట్లు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ తనిఖీలు నగరంలోని నేరస్తులకు వణుకు పుట్టిస్తున్నాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరం మొత్తం మీద సుమారు 1300 మంది రౌడీ షీటర్లను గుర్తించారు. వీరిలో ప్రాథమిక దశలో 250 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా,గ్ర్భాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. డ్రగ్స్ పరీక్షలు జరిపిన 250 మందిలో ఏకంగా 190 మందికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలడం కలకలం రేపుతోంది. అంటే దాదాపు 75 శాతం మంది రౌడీ షీటర్లు మత్తు పదార్థాలకు బానిసలయ్యారని స్పష్టమైంది.వీరిలో అత్యధిక శాతం మంది గంజాయికి అలవాటు పడినట్లు పోలీసులు గుర్తించారు. రౌడీ షీటర్లు మత్తులో ఉండి తీవ్రమైన నేరాలకు పాల్పడే అవకాశం ఉండటంతో పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. వీరికి గంజాయి ఎక్కడి నుండి సరఫరా అవుతోంది? దీని వెనుక ఉన్న ప్రధాన నెట్‌వర్క్ ఏమిటి? వీరు డ్రగ్స్, గంజాయి ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారు అనే కోణంలో పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు.

# అన్న ప్రసన్నం చేసిన సర్పంచ్ కిరణ్ కుమార్ రొడ్డ





**కొత్తపల్లి గోరి, ఏప్రిల్ 10 (తీన్మార్ న్యూస్):**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి కోనరావుపేట గ్రామపంచాయతీలో అంగన్వాడి సెంటర్ నందు పులి యామిని–శ్రీకర్ దంపతుల కుమారుడు జై రాముకు సర్పంచ్ కిరణ్ కుమార్ రొడ్డ అన్నప్రాసనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలం స్తంభవిస్తున్న సమయంలో ఎండల తీవ్రత బాగా ఉన్నందున పిల్లలను బయటకి పంపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే అంగన్వాడి సెంటర్ నుండి వచ్చే ఆహార పదార్థాలు పౌష్టికరమైన ఆహార పదార్థాలు కావున కచ్చితంగా పిల్లలకు అందే విధంగా చూడాలని ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ మాధవికి సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింగాల రాజన్న, వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి బొంకూరి శ్రీకాంత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూర్తి, అంగన్వాడి టీచర్ మాధవి మరియు మహిళా సంఘాల సిఎ రమేష్, తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రియురాలికి హెచ్ఐవీ రక్తం ఘటనలో విషాదం..

## అవమానం, బాధతో యువతి ఆత్మహత్య

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ఇటీవల ఓ యువకుడు తన ప్రియురాలికి హెచ్ఐవీ ఇంజెక్షన్ ఇచ్చిన ఘటనలో విషాదం చోటుచేసుకుంది. పెళ్లికి నిరాకరించిందనే కోపంతో ఓ యువకుడు యువతికి బలవంతంగా హెచ్ఐవీ సోకిన రక్తాన్ని ఎక్కించగా, ఆ మనస్తాపంతో బాధిత యువతి తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చిన్ననాటి నుంచి ప్రేమించిన వ్యక్తే తన జీవితాన్ని ఇలా నాశనం చేశాడన్న బాధతో ఆమె ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది.జనగామ జిల్లాకు చెందిన యువకుడు హైదరాబాద్‌లో ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతడి తల్లిదండ్రులిద్దరికీ హెచ్ఐవీ పాజిటివ్ ఉండగా, తండ్రి గతంలోనే మరణించాడు. సమీప బంధువైన యువతిని అతడు ప్రేమించగా, పెద్దలు కూడా పెళ్లికి అంగీకరించారు. అయితే, వివాహానికి ముందు యువతి తండ్రి జరిపించిన రక్త పరీక్షల్లో యువకుడికి కూడా హెచ్ఐవీ ఉన్నట్లు తేలింది. దీంతో యువతి కుటుంబ సభ్యులు ఈ పెళ్లిని రద్దు చేసుకున్నారు. కుమార్తె జీవితాన్ని తెలిసి నాశనం చేయలేమని, యువకుడి కుటుంబానికి వారు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.వివాహం రద్దవడాన్ని జీర్ణించుకోలేకపోయిన నిందితుడు, తాను ప్రేమించిన యువతికి కూడా హెచ్ఐవీ సోకితే మరెవరూ పెళ్లి చేసుకోరని, అప్పుడు కచ్చితంగా తననే చేసుకుంటుందని వికృతంగా ఆలోచించాడు. మార్చి నెల 11న తన రక్తాన్ని సిరంజీలోకి తీసుకుని, యువతి ఇంటికి వెళ్లి ఆమె నిరాకరించడంతో బలవంతంగా ఆ రక్తాన్ని ఎక్కించి పారిపోయాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ప్రాణాంతక వ్యాధి సోకిందన్న ఆందోళన, సమాజంలో ఎదురయ్యే అవమానం తట్టుకోలేక ఆ యువతి ప్రాణాలు తీసుకోవడం అందర్నీ కలచివేస్తోంది. తన తప్పు లేకున్నా, ఆమె చనిపోయిందని తెలియడంతో స్థానికంగా విషాదం నెలకొంది.ఈ ఘటనలో ఆ యువకుడు దారుణమైన తప్పిదం చేశాడు. ప్రేమించిన యువతి హాయిగా ఉండాలని ఆలోచించలేదు. తన కుటుంబంతో పాటు తనకు హెచ్ఐవీ ఉందని గమనించి సైలెంట్ గా ఉండలేదు. అదే కారణంతో తనను రిజెక్ట్ చేయడం, పెళ్లి రద్దు కావడంతో ఆమెను ఎలాగైనా దక్కించుకోవాలని ప్రమాదకర హెచ్ఐవీ రక్తాన్ని ఆమెకు బలవంతంగా ఇంజెక్ట్ చేశాడు. అలా చేస్తే ఆమె నిజంగానే అతడ్ని పెళ్లి చేసుకుంటుందా? నేరస్తుడిగా జైలుకు వెళ్తానని మాత్రం ఆలోచించలేకపోయాడు. ఆ అవమాన భారంతోనో, లేక భయంతోనే యువతి ఏదైనా తీసుకోకూడదని నిర్ణయం తీసుకుంటే పరిస్థితి ఏంటని కూడా థింక్ చేయలేదు. అతడి వికృత నిర్ణయం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఆ తల్లిదండ్రులకు కన్నీళ్లే మిగిల్చింది. పెళ్లి చేసి అత్తింటికి పంపాలని భావించిన తల్లిదండ్రులు కూతుర్ని శ్మశానానికి సాగనంపి, ఆమెకు తుది వీడ్కోలు పలకాల్సి రావడం కంటే నరకం ఇంకేమైనా ఉంటుందా అని స్థానికులు, నెటిజన్లు అంటున్నారు. తనకు దక్కనిది ఎవరు దక్కకూడదని భావించే వాళ్లు, దక్కించుకునేందుకు ఏదైనా పిచ్చి పనులు చేస్తే వారికి కఠిన శిక్షలు వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# జీవన్ రెడ్డి రాజ్యసభ పదవి వదులుకొన్నారు

**హైదరాబాద్ :** జగిత్యాల జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమించిన టి జీవన్ రెడ్డి త్వరలో బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. జీవన్ రెడ్డి పార్టీని వీడటం బాధాకరమని, ఓ మంచి అవకాశాన్ని కోల్పోయారని నేతలు చెబుతున్నారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్‌ను వీడటంపై దానం నాగేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జగిత్యాల మాజీ ఎమ్మెల్యే టి. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వెళ్లడం ఒక తొందరపాటు చర్య అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే దానం నాగేందర్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనను పార్టీలోనే కొనసాగేలా చేసేందుకు చివరి నిమిషం వరకు ఎంతో ప్రయత్నించారని ఆయన పేర్కొన్నారు. జీవన్ రెడ్డికి తదుపరి విడతలో రాజ్యసభ సీటు ఇచ్చే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ, ఆయన ఓపిక పట్టకుండా ఎమోషనల్‌గా నిర్ణయం తీసుకుని బీఆర్ఎస్ పార్టీలో చేరనుండటం దురదృష్టకరమని దానం వ్యాఖ్యానించారు.పార్టీ సీనియర్ నాయకుడిగా జీవన్ రెడ్డి ఎన్నో సేవలు అందించారని, అటువంటి నేత పార్టీని విడటం బాధాకరమని దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్‌లోని పెద్ద గణేష్ విగ్రహం వద్ద 99 రోజుల ప్రజా పాలన ఉత్సవాల్లో భాగంగా, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ప్రియాంకతో కలిసి నిర్వహించిన "ఫ్రైడే డ్రైడే" ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు.ఇదే క్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై దానం నాగేందర్ విమర్శలు గుప్పించారు. సమస్యల పరిష్కారం కంటే పబ్లిసిటీకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. కేవలం ప్రచారం కోసమే దోమతెరలు వేసుకుని బయట తిరుగుతున్నారని సుధీర్ రెడ్డిని ఉద్దేశించి ఎద్దేవా చేశారు.

# తిరుమలగిరి గ్రంధాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్ :** నేటి తరానికి జ్ఞానాన్ని సమకూర్చేందుకు గ్రంథాలయాల ఆవశ్యకత ఎంతైనా ఉందని కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్ అన్నారు.తిరుమలగిరి లాల్ బజార్ లో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రారంభించారు. కోటి యాభై లక్షల రూపాయల నిధులతో గ్రంథాలయాన్ని నిర్మించి విద్యార్థులకు యువతకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ గ్రంథాలయం మూలంగా వచ్చే సమాచార సేకరణ, విషయ పరిజ్ఞానం యువతకు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.



# చరిత్రను తిరగరాసిన రణ్‌వీర్ సింగ్..

**రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరిన మొదటి బాలీవుడ్ సినిమాగా 'ధురంధర్ 2'**

బాలీవుడ్ చిత్ర పరిశ్రమలో సరికొత్త చరిత్ర ఆవిష్కృతమైంది. స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా, దర్శకుడు ఆదిత్య ధర్ రూపొందించిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేటను కొనసాగిస్తూ సరికొత్త మైలురాయిని అధిగమించింది. గతంలో 'బాహుబలి 2', 'పుష్ప 2' వంటి చిత్రాలు అన్ని భాషల్లో కలిపి భారీ వసూళ్లు సాధించినప్పటికీ, కేవలం హిందీ వెర్షన్‌లోనే రూ.1000 కోట్ల నెట్ వసూళ్లను సాధించిన మొదటి భారతీయ చిత్రంగా 'ధురంధర్ 2' రికార్డు సృష్టించింది. ఈ ఘనత సాధించిన తొలి బాలీవుడ్ చిత్రంగా ఇది చరిత్రలో నిలిచిపోనుంది. ఈ సినిమా విడుదలైన నాటి నుంచే థియేటర్ల వద్ద కాసుల వర్షం కురిపిస్తున్న సంగతి తెలిసిందే. ట్రేడ్ అనలిస్టుల అంచనాలను తలకిందులు చేస్తూ, కేవలం 21 రోజుల్లోనే రూ.1041 కోట్ల నికర వసూళ్లను రాబట్టింది. ఇక ప్రపంచవ్యాప్తంగా గ్రాస్ వసూళ్ల విషయానికి వస్తే, ఈ చిత్రం ఇప్పటికే రూ.1665 కోట్ల మార్కును దాటి తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. 2025లో బ్లాక్‌బస్టర్ హిట్ సాధించిన 'ధురంధర్'కు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం, కథా బలంతో పాటు అబ్బురపరిచే యాక్షన్ సీక్వెన్స్‌లతో ప్రేక్షకులను కట్టిపడేసింది. రణ్‌వీర్ సింగ్ తన కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్‌కు తోడు, సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి దిగ్గజ నటుల కలయిక సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సారా అర్జున్, రాకేష్ బేడీ తమ నటనతో సినిమాకు వెన్నుముకగా నిలిచారు.

## రావు బహదూర్' నుంచి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్



వైవిధ్యమైన కథలు ఎంచుకుంటూ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటుడు సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నలేటెస్ట్ చిత్రం 'రావు బహదూర్'. 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ దర్శకుడు వెంకటేష్ మహా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే వచ్చిన టీజర్, ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ ఫస్ట్ లుక్, టీజర్ ఆధారంగా ఇది ఒక విభిన్నమైన పీరియడ్ డ్రామా అని, సత్యదేవ్ తన కెరీర్‌లో డిఫరెంట్ రోల్ చేస్తున్నారని అర్థం అవుతుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు ఓ కూల్ పోస్టర్ రిలీజ్ చేస్తూ.. 'ప్రేమకు అంకితం, ప్రేమ నుండే పుట్టిన గీతం 'ఓ సుందరి'.. 'రావు బహదూర్' నుంచి ఫస్ట్ సింగిల్ ఓ సుందరి ఏప్రిల్ 15న విడుదలవుతోంది' అని తెలిపారు. ఇక విడుదల చేసిన పోస్టర్‌లో హీరో అండ్ హీరోయిన్ లుక్ కూల్‌గా ఆకట్టుకుంటోంది. కాగా.. మహేష్ బాబు, నమ్రత సమర్పిస్తున్న ఈ చిత్రం క్షీణిస్తున్న కులీన వర్గాల నేపథ్యంతో సాగుతుంది. ఇందులో సత్యదేవ్‌తో పాటు దీప థామస్, ఆనంద్ భారతి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 2026 సమ్మర్ టార్గెటా ఈ చిత్రం రిలీజ్‌కు సిద్ధం అవుతుండగా.. డేట్ త్వరలో ప్రకటించనున్నారు మేకర్స్.



# మనకు దక్కాల్సినవి సరైన సమయం వచ్చినప్పుడే దక్కుతాయి..

మలయాళ ముద్దుగుమ్మ మమితా బైజు.. ప్రజెంట్ బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా ఆఫర్స్ అందుకుంటూ బిజీ లైఫ్ లీడ్ చేస్తుంది. ఆమె నటిస్తున్న వరుస ప్రాజెక్టులలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' ఒకటి. కోలీవుడ్ వర్సటైల్ యాక్టర్ సూర్య, సెన్సిబుల్ డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రాబోతున్న ఈ ప్రాజెక్టు సంబంధించిన షూటింగ్ ప్రజెంట్ శరవేగంగా జరుగుతున్నది. ఇందులో భాగంగానే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సినిమాపై ఆసక్తికర కామెంట్స్ చేసింది మమిత. 'విశ్వనాథ్ అండ్ సన్స్ చిత్రంలో ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు బలమైన ఎమోషనల్ కంటెంట్ కూడా ఉంటుంది. ఇది ఒక సంపూర్ణ వినోదాత్మక చిత్రంగా రూపొందగా.. ఈ చిత్రం ప్రేక్షకులకు పూర్తిస్థాయిలో ఎగ్జైట్‌మెంట్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. నన్ను నమ్మండి.. ఈ సినిమా అద్భుతంగా ఉండబోతోంది' అని తెలిపింది. అలాగే తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ.. 'నేను మలయాళ చిత్రసీమలో నా ప్రయాణాన్ని ఒక సహాయ నటిగా ప్రారంభించాను. ఇప్పుడు ప్రధాన పాత్రల వైపు అడుగులు వేస్తున్నాను. ప్రతి విషయాన్ని దశలవారీగా ముందుకు తీసుకెళ్లడాన్ని నేను విశ్వసిస్తాను.. ఎందుకంటే మనకు దక్కాల్సినవి సరైన సమయానికి తప్పక మనల్ని చేరుతాయి' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది మమిత.

# రాజశేఖర్ ఫిట్‌నెస్ సీక్రెట్



టాలీవుడ్ సీనియర్ హీరో రాజశేఖర్ ఈ మధ్యే తన సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టి వరుస సినిమాలతో ప్రేక్షకులను పలకరిస్తున్నాడు. కొంత కాలం క్రితం నితిన్ హీరోగా రూపొందిన ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్ చిత్రంలో కీలకమైన పాత్రలో నటించి ప్రేక్షకులను అలరించాడు. ఈ చిత్రం బాక్స్ ఆఫీస్ దగ్గర ఫెయిల్యూర్ అయింది. తాజాగా శర్వానంద్ ప్రధాన పాత్రలో రూపొందిన బైకర్ చిత్రంలో ఈయన శర్వానంద్ కి తండ్రి పాత్రలో నటించాడు. ఈ మూవీలోని రాజశేఖర్ పాత్రకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ప్రస్తుతం రాజశేఖర్ వయస్సు 64 సంవత్సరాలు, అయినా కూడా ఈ సీనియర్ నటుడు ఎంతో ఫిట్‌గా, అందంగా కనబడుతున్నాడు. దాంతో ఈయన ఎలాంటి డైట్ పాటిస్తాడు అని తెలుసుకోవాలి అనే ఉత్సాహం జనాల్లో బాగానే ఉంది. తాజాగా రాజశేఖర్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అందులో ఆయన రోజు ఎలాంటి ఫుడ్ తీసుకుంటారు అనేది క్లియర్గా చెప్పుకొచ్చాడు. రాజశేఖర్ మాట్లాడుతూ... నేను రోజు తీసుకునే ఆహారం విషయంలో ఎక్కువ శాతం పండ్ల రసాలకు ప్రాముఖ్యత ఇస్తాను. రోజులో వాటిని ఎక్కువ మోతాదులో తీసుకుంటాను. కేవలం మంచి ఫుడ్ తీసుకోవడం మాత్రమే కాకుండా రోజులో కొన్ని గంటల పాటు వ్యాయామం కూడా చేస్తుంటాను. దాని ద్వారా కూడా మన శరీరం ఎంతో బాగుంటుందని, ఇలా మంచి డైట్, శరీరానికి తగిన ఎక్సర్సైజ్ రెండూ సమాన స్థాయిలో మెయింటెన్ చేయడం వల్లే తాను ఈ వయసులో కూడా అందంగా ఉన్నట్లు రాజశేఖర్ తాజాగా చెప్పుకొచ్చారు.

# రూ.10 కోట్లు పెడితే రూ.100 కోట్లు.. మలయాళంలో హిట్టు కొట్టిన తెలుగు నిర్మాత




మలయాళంలో రెండేళ్ల క్రితం సంచలన విజయం సాధించిన చిత్రాల్లో "వాళా" ఒకటి. కేవలం రూ.4 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ ఏకంగా రూ.40 కోట్లు వసూలు చేసింది. వాళా అంటే మలయాళంలో అరటి మొక్క అని అర్థం. అలాగే పనీపాటా లేకుండా తిరిగే సోమరులని కూడా అదే పేరుతో పిలుస్తారు. వాళా చిత్రానికి 'బయోపిక్ ఆఫ్ బిలియన్ బాయ్స్' అనేది ట్యాగ్‌లైన్ ఇచ్చారు.

**మలయాళంలో హిట్ కొట్టిన తెలుగు డైరెక్టర్**

2024లో వచ్చిన ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'వాళా 2' వచ్చింది. 'బయోపిక్ ఆఫ్ బిలియన్ బ్రోస్' అనేది ఉపశీర్షిక. ఈ రెండు భాగాలకు కథ అందించింది విపిన్ దాస్ ఒక్కరే అయినా.. దర్శకులు మాత్రం మారారు. మొదటి భాగానికి ఆనంద్ మీనన్ దర్శకత్వం వహించగా రెండో భాగాన్ని సవిన్ డైరెక్ట్ చేశాడు. సీక్వెల్‌కు రూ.10 కోట్ల బడ్జెట్ కేటాయించారు. తెలుగు నిర్మాత సాహు గారపాటి ఈ సినిమా నిర్మాతల్లో ఒకరిగా ఉన్నాడు.

**సెంచరీ కొట్టిన వాళా 2**

ఏప్రిల్ 2న విడుదలైన ఈ చిత్రం ఏకంగా సెంచరీ కొట్టింది. కేవలం వారం రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిపోవడం విశేషం. ఈ ఏడాది మన శంకరవరప్రసాద్‌గారుతో హిట్ అందుకున్న సాహు గారపాటి.. మూడు నెలల్లో వాళా 2తో మరో బ్లాక్‌బస్టర్ అందుకున్నాడు. కాగా వాళా మొదటి భాగం హాట్‌స్టార్‌లో మలయాళంతో పాటు తెలుగులోనూ అందుబాటులో ఉంది.



# వరుణ్ తేజ్ కొరియన్ కనకరాజు నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమో!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు' ఇండో–కొరియన్ నేపథ్యంలో హారర్–కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463